RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM: HYDERABAD | సంపుటి: 00 | సంచిక: 0 | బుధవారం, 04 డిసెంబర్, 2024 | ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న | అసోసియేట్ ఎడిటర్: కే రాజేంద్ర ప్రసాద్ | పేజీలు: 08 వెల: 2 రూ/-

# న్యూయార్క్ టోక్యోతో సమానంగా హైదరాబాద్

- రూ.5827 కోట్ల అభివృద్ధి పనులు షురూ
- హైదరాబాద్ నగరాన్ని న్యూయార్క్, టోక్యోతో సమానంగా నడిపిస్తాం
- హైదరాబాద్‌లో ఆరాంఘర్ నుంచి జూపార్క్ వరకు నిర్మించిన మరో అతిపెద్ద ఫ్లైఓవర్‌ను రేవంత్ రెడ్డి ప్రారంభించారు.
- ఈ ఫ్లైఓవర్‌ను రూ. 636 కోట్లతో 24 మీటర్ల వెడల్పు, 4.4 కిలోమీటర్ల వెడల్పుతో నిర్మించారు.
- వరద నీటిని నియంత్రించే పనులకు రూ.17 కోట్ల అంచనాలతో చేపట్టే పనులను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు.



## ఇండ్లులేని పేదలకు తీపి కబురు..

- ఇందిరమ్మ ఇళ్లపై సర్కార్ కీలక అప్డేట్
- డిసెంబర్ 5న ఇందిరమ్మ యాప్ ప్రారంభించనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి
- తొలి విడతలో నియోజకవర్గానికి 3500 మంది చొప్పున లబ్ధిదారులను ఎంపిక చేస్తామని మంత్రి ప్రకటించారు.
- అందులోనూ అత్యంత పేదలకు ప్రాధాన్యం కల్పిస్తామన్నారు.




## మహిళా కానిస్టేబుల్ హత్య కేసు

- ఇబ్రహీంపట్నం మహిళా కానిస్టేబుల్ హత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.
- కులాంతర వివాహం, ఎకరా పొలం వివాదంతోనే అక్క నాగమణిని తమ్ముడు పరమేష్ కిరాతకంగా హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు.
- అక్క కులాంతర వివాహం చేసుకోవటంతో తన పెళ్లి ఆగిపోయిందని కక్ష పెంచుకున్న పరమేష్.. మాటువేసి ఆమెను కిరాతకంగా నరికి చంపేశాడు.



## నటి శోభిత సూసైడ్ కేసు

- కన్నడ నటి శోభిత సూసైడ్ కేసులో గచ్చిబౌలి పోలీసులు విచారణ ముమ్మరం
- ఇప్పటికే సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకోగా..
- తాజాగా కుటుంబ సభ్యుల స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు.
- అందులో వారు కీలక విషయాలు వెల్లడించారు.
- ఆమె ఆత్మహత్యపై తమకు ఎలాంటి అనుమానాలు లేవన్నారు.
- ఒంటరిగా ఉండటం, ఇండస్ట్రీలో అవకాశాలు రాక డిప్రెషన్‌లోకి వెళ్లి ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చనని పోలీసులకు స్టేట్‌మెంట్ ఇచ్చారు.



## ఎన్కౌంటర్ పై అనుమానాలు ఉన్నాయి


### బిఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్ : ఏటూరునాగారంలో జరిగిన మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై అనుమానాలు ఉన్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి తెలిపారు. ఫేక్ ఎన్‌కౌంటర్లు ఎప్పటికైనా సరికాదని, గతంలో కేసీఆర్ కూడా ఎన్‌కౌంటర్లను ఒప్పుకోలేదు అని గుర్తు చేశారు. మా ఆదివాసీలను ఎక్కువగా చంపుతున్నారని దీనిపైన మాకు అనుమానాలు ఉన్నాయని దానిపై కోర్టులో వేశామని.. ఆదివాసి హక్కుల సంఘాలకు సంబంధించిన మిత్రులు మాకు రిప్రజెంటేషన్ ఇచ్చారని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థిలో ఎన్‌కౌంటర్ ఫేక్ అయితే మాత్రం తప్పకుండా అధికారులపై చర్యలు తీసుకోవాలి అని తెలిపారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటికీ 14 ఎన్‌కౌంటర్లు జరిగాయి..వాటిపై ఎవరికి అనుమానాలు ఉన్నా విచారణ చేయాల్సిన అవసరం ఉంది అని పేర్కొన్నారు.



## ప్రశ్నించే వాళ్లకు బతికే స్వేచ్ఛ లేదా

- మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌లో తెలంగాణ పోలీసులు ఎందుకు పాల్గొన్నారు
- ముమ్మాటికీ బూటకపు ఎన్‌కౌంటరే
- సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబాశివ రావు



## మాజీ మంత్రి హరీష్ రావు పై కేసు నమోదు

- ప్రజా పాలన కాదు.. పోలీసుల రాజ్యం..
- నక్సలైట్లు ఉండాలన్న రేవంత్ రెడ్డి ఎన్కౌంటర్ లు చేయిస్తుండు
- బీఆర్ఎస్ నేత దేవీప్రసాద్





## సంపాదకీయం

### ఉపకారికి బంగ్లాదేశ్ అపకారం!

కూర్చున్న కొమ్మనే నరుక్కుంటూ భవిష్యత్తును కాలరాసుకోవడం అంటే ఏమిటో ఇవాళ బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలను చూసి అర్థం చేసుకోవచ్చు! రిజర్వేషన్ల విషయంలో అసంతృప్తి పేరిట హసీనా నాయకత్వంలోని గత ప్రభుత్వానికి వ్యతిరేకంగా మొదలైన నిరసనలను ఉద్దేశపూర్వకంగా హిందువుల వైపు మరల్చి, మరీ ముఖ్యంగా హిందూ స్త్రీల పట్ల చెప్పలేని చూడలేని దారుణ మారణకాండను సృష్టిస్తున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలను సోషల్ మీడియాలో చూసి కన్నీరు కార్చని హృదయం లేదు. ఎలాగో కాస్త తేరుకున్న బంగ్లాదేశ్ హిందువులు, వారికి మద్దతుగా ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలలోని హిందువులు చేపట్టిన నిరసనల ఫలితంగా తాత్కాలికంగా హింసాకాండ ఆగినట్టు కనిపించినా కొద్ది రోజుల్లోనే మళ్లీ వికృత చేష్టలు మొదలయ్యాయి. ఇందులో భాగంగానే తాజాగా ఇస్కాన్ (ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ కృష్ణ కాన్షస్‌నెస్) పూజారి అయిన చిన్మోయ్ కృష్ణదాస్‌పై దేశద్రోహి ముద్ర వేసి జైలుకి పంపాలన్న కుట్ర మొదలైంది. చిన్మోయ్ కృష్ణదాస్ తరఫున వాదిస్తున్న ప్రభుత్వ న్యాయవాదిని అల్లరి మూకలు హత్య చేశాయి. బంగ్లాదేశ్‌లో కొనసాగుతున్న మారణకాండకు వ్యతిరేకంగా బాధిత హిందువులను సమైక్యపరిచి, కాపాడేందుకు ప్రయత్నించడమే చిన్మోయ్ కృష్ణదాస్ చేసిన తప్పు. బంగ్లాదేశ్‌లో గత ఆగస్టు నెల నుంచి కొనసాగిన విధ్వంసకాండలో లెక్కకు మించి హిందూ దేవాలయాలు ధ్వంసం అయ్యాయి. ఇందులో పదుల కొద్దీ ఇస్కాన్ మందిరాలు కూడా ఉన్నాయి. బంగ్లాదేశ్‌లో ఇస్కాన్‌కు 65 దేవాలయాలుండగా 50 వేలకు పైగా భక్తులు ఉన్నారు. తాజా పరిణామాల్లో భాగంగా ఇస్కాన్‌కి వ్యతిరేకంగా జమాతే ఏ ఇస్లామి సంస్థ బెదిరింపులకు తెగబడింది. ఈ సంస్థ కార్యకర్తలు ఇస్కాన్ ఆలయ బోర్డును కూడా తొలగించి తమ సంస్థ బోర్డు పెట్టారు. అసలు చిన్మోయ్ అరెస్ట్‌కి ముందే బంగ్లా పోలీసులు ఇస్కాన్ ఉగ్రవాద సంస్థ అని వాదిస్తున్నారు. ఇస్కాన్ సభ్యులు భారత నిఘా సంస్థకు అనుబంధంగా పని చేస్తున్నారనీ, దేశంలో మతపరమైన హింసకు వీరే కారణమనీ ఆరోపించారు. బంగ్లాదేశ్‌లో అనేక విలయాలు సంభవించినప్పుడు అక్కడి ప్రజలకు అండగా నిలిచి, బాధితులకు అన్నవస్త్రాలూ నిత్యావసరాలూ ఇచ్చి ఆదుకున్న ఇస్కాన్‌పై దేశద్రోహి అన్న ముద్ర వేశారు. బంగ్లాదేశ్‌లోని హిందూ మైనారిటీల రక్షణపై భారత ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ వస్తోంది. కానీ, బంగ్లాదేశ్ లోని యూనిస్ సర్కారు భారత ప్రభుత్వ వాదనను తోసిపుచ్చుతూ వచ్చింది. ఇప్పుడు తమ నిర్లక్ష్యాన్నీ, వివక్షాపూరిత వైఖరినీ కప్పిపుచ్చుకునేందుకు ఇస్కాన్‌ని దోషిగా చూపిస్తోంది. చిన్మోయ్ అరెస్ట్‌తో దేశంలోని హింసకు బాధ్యత వహించకుండా తప్పించుకునే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇస్కాన్ సంస్థపై నిషేధం విధించాలన్న పిటిషన్‌ని బంగ్లాదేశ్‌లోని ఢాకా హైకోర్టు తోసిపుచ్చడం ఒక్కటే కాస్త ఉపశమనం. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలలో విస్తరించిన ఇస్కాన్ కార్యకలాపాలపై, సేవలపై ఎక్కడా ఏ వివాదాలూ తలెత్తలేదు. చివరికి భారత్ దాయాది పాకిస్థాన్‌లో సైతం కరాచీ, లరా?నా, సింధ్, హైదరాబాద్, క్వెట్టా, బలొచిస్థాన్ ప్రాంతాల్లో ఇస్కాన్ సంస్థ సేవలు కొనసాగుతున్నాయి. మరెక్కడా లేని రీతిలో ఒక్క బంగ్లాదేశ్‌లోనే ఇస్కాన్‌ని లక్ష్యంగా చేసుకోవడం చూస్తే ఇది కుట్ర గాక మరేమిటి? మూడు నెలల కిందట బంగ్లాదేశ్‌లో భారీగా వానలు కురిసినప్పుడు పలు గ్రామాలు నీట మునిగి అనేక ప్రాంతాలు జలమయమై ఆహారం, ఆశ్రయం లేకుండా పోయాయి. ఆ పరిస్థితుల్లో ఇస్కాన్ భక్తులు బంగ్లాదేశ్ వరద బాధితులకు గొప్ప సేవలందించారు. ప్రాణాలను పణంగా పెట్టి మరీ పడవలపై వరద నీటిలో బాధితుల వద్దకు వెళ్ళి ఆకలి తీర్చారు. బంగ్లాదేశ్‌లో ఇలా ప్రకృతి విలయం ఎప్పుడు సంభవించినా ఇస్కాన్ సభ్యులు చేయూతనిస్తుంటారు. బంగ్లాదేశ్‌లో హిందువుల పైనా, ఇస్కాన్ ఆలయాలపైనా దాడులు జరిగిన సమయంలో కూడా ఇస్కాన్ భక్తులు తమ సేవలను ఆపలేదు. తమపై దాడి జరిగిన చోటే వరద బాధితల కడుపులు నింపిన సహృదయత బంగ్లాదేశ్ ఇస్కాన్ సభ్యుల్లో కనిపించింది. ప్రత్యేకించి శ్రీ కృష్ణ జన్మాష్టమి ఉత్సవ సమయంలో కులమత బేధమన్నది లేకుండా ఆ దేశంలోని పేదలకు ఇస్కాన్ సంస్థ రేషన్ కూడా అందజేస్తూ వస్తోంది. ఇలా ఎన్నో సేవలతో బంగ్లాదేశ్ ప్రజలను అదుకున్న ఇస్కాన్‌పై లేనిపోని ఆరోపణలు చేసి నిషేధం విధించాలనడం బుద్ధి జీవులకు ఆమోదయోగ్యం కాదు. బంగ్లాదేశ్ ప్రజలకు ఇస్కాన్ చేస్తున్న సేవలు ఇలా ఉండగా%-% ఆ దేశ ప్రభుత్వానికి భారత సర్కారు ఎన్ని సందర్భాల్లో అండగా నిలిచిందన్నది మరో పెద్ద చరిత్ర! బంగ్లాదేశ్ ఆవిర్భావానికి మూలం భారత్. అక్కడి ప్రజలు పోరాటం చేస్తున్నప్పుడు అండగా నిలిచి బంగ్లాదేశ్ ప్రత్యేక దేశంగా ఏర్పాటు అయ్యేందుకు సైనిక బలగాలను పంపించి అండగా నిలిచిన దేశం మన దేశం! బంగ్లాదేశ్ ఏర్పడినప్పుడు ఆ దేశ జనాభాలో హిందువులు దాదాపు 20శాతం ఉండేవారు. నేడు చూస్తే అక్కడ హిందూ మైనార్టీలు 8 శాతానికి క్షీణించారు. జనవరి 2013 నుంచి సెప్టెంబర్ 2021 మధ్య కాలంలో హిందూ సమాజంపై కనీసం 3,679 సార్లు దాడులు జరిగాయని అంతర్జాతీయ మీడియా సంస్థ బీబీసీ వెల్లడించింది. అయినప్పటికీ ఆ దేశంలో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు భారత ప్రభుత్వం భారీగా సహాయ సహకారాలు అందిస్తూ వచ్చింది. ఆపత్కాలంలో ఆ దేశ ప్రభుత్వానికి చేదోడువాదోడుగా నిలిచింది. మరోవైపు ఇస్కాన్ సంస్థతో పాటుగా హిందూ సమాజానికి చెందిన సంస్థలు బంగ్లాదేశ్‌లో వివిధ రకాలుగా సేవలు చేస్తున్నాయి. ప్రస్తుత బంగ్లాదేశ్ అధినేత మహ్మద్ యూనిస్ నోబెల్ బహుమతి పొందిన విశిష్ట వ్యక్తి. ప్రభుత్వాధినేతగా ఆయన చొరవ చూపించి ఈ అకృత్యాలను ఆపి, చిన్మోయి కృష్ణదాస్‌ను విడుదల చేస్తారని ఆశిద్దాం. ఈ డిమాండ్ భారతదేశ వ్యాప్తంగా వినిపిస్తోంది. సుమారు 150కు పైగా రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు, రిటైర్డ్ హైకోర్టు జడ్జీలు, రిటైర్డ్ సైనికాధికారులు సంతకాలు చేసి, గౌరవ రాష్ట్రపతికి సమర్పించిన వినతిపత్రంలో, చిన్మోయి కృష్ణ దాస్‌ను విడుదల చేసి బంగ్లాదేశ్‌లో హిందువులు సహా మైనారిటీలను రక్షించాలన్న డిమాండ్‌ను గట్టిగా వినిపించారు.

# రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యానికి సవాల్‌గా మారిన ఆదివాసీ జాతి హననం




రాజకీయ పార్టీల జోక్యంతోనే పరిష్కారం జాతీయ సదస్సు 10, 11 2024, ఢిల్లీ ౼రపత్రం భారత రాజ్యాంగం దేశంలోని అల్ప సంఖ్యాక వర్గాలకు ప్రత్యేక రక్షణ కల్పించింది. దీనికి మూలం సమానత్వ భావం. సంఖ్యాపరమైన మెజారిటీ, మైనారిటీ అనే తేడాలు, సామాజిక సాంస్కృతిక ప్రత్యేకతలు, నైసర్గిక జీవన విధానాలు ఉన్నందు వల్ల సమానత్వ సాధన ఒక ముఖ్యమైన కర్తవ్యంగా రాజ్యాంగం భావించింది. ఇందులో భాగంగా ఆదివాసుల హక్కులకు ప్రాధాన్యత ఇచ్చింది. కానీ రాజ్యాంగం ప్రకారం పాలించాల్సిన ప్రభుత్వాలు దీనికి భిన్నంగా ప్రవర్తిస్తున్నాయి. ఆదివాసుల హక్కులకు విఘాతం కలిగేలా నిర్ణయాలు తీసుకుంటున్నాయి. ఆదివాసులు జీవిస్తున్న అటవీ ప్రాంతాల్లో చట్టాలకు విరుద్ధంగా జోక్యం చేసుకుంటున్నాయి. ఈ పరిస్థితి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ ఉన్నదే. దీనికి పరాకాష్ట ఇటీవల గత కొద్ది నెలలుగా మధ్యభారత దేశంలో ముఖ్యంగా చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఆదివాసుల మీద అణచివేత. గతంలో ఎన్నడూ లేనంతగా పాలకులు ఆదివాసీ గూడేల సమీపంలో పోలీసు క్యాంపులు ఏర్పాటు చేసి ఆదివాసుల సాధారణ జీవితాన్ని అల్లకల్లోలం చేస్తున్నారు. సోదాలు, వేధింపులు, అక్రమ అరెస్టులు, ఎన్‌కౌంటర్ హత్యల దాకా తీవ్రమైన అణచివేత కొనసాగుతోంది. ఈ ఏడాది జనవరి నుంచి వందలాది మంది ఆదివాసులను పోలీసు, సైనిక బలగాలు చంపేశాయి. అటవీ ప్రాంతాల్లో గనుల తవ్వకానికి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుమతి ఇవ్వడం వల్లనే అక్కడ రాజ్యాంగ ఉల్లంఘనలు జరుగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. రాజ్యాంగం ప్రకారం గనుల తవ్వకానికి అనుమతి లేని ప్రాంతాల్లోకి కూడా కార్పొరేట్ సంస్థలు చొరబడుతున్నాయి. ఆదివాసులు దీన్ని వ్యతిరేకిస్తున్నారు. గనుల తవ్వకాల వల్ల తమ జీవితం ధ్వంసమవుతుందని, విస్థాపనకు గురవుతామని, పర్యావరణం దెబ్బతింటుందని ఆందోళన చేస్తున్నారు. వాళ్లను అణచివేయడానికి లక్షలాది పోలీసు, సైనిక బలగాలను అటవీ ప్రాంతాలకు తరలి వెళ్లాయి. క్యాంపుల నుంచి పోలీసులు రాకెట్ లాంఛర్లతో గూడేల మీదికి బాంబులు విసురుతున్నారు. ఆకాశంలోంచి డ్రోన్ దాడులు కూడా చేస్తున్నారు. ఈ స్థితి మీద దేశంలోని ప్రజాస్వామికవాదులు ఆందోళనపడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో ఈ మారణకాండ జరుగుతోంది. ఆదివాసుల హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వాలు కార్పొరేట్ల దోపిడీ కోసం పని చేస్తున్నాయి. రాజ్యాంగ విలువలు, ఆదర్శాలు సంక్షోభంలో పడిపోవడం మన ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్రమైన సవాల్. ఇది కేవలం పోలీసుల, సైనిక బలగాల దుశ్చర్యలు మాత్రమే కాదు. ఇదొక ముఖ్యమైన రాజకీయ సమస్య. హక్కుల ఉల్లంఘనకు తప్పనిసరిగా రాజకీయ సందర్భం ఉంటుంది. పాలకులు ఎన్నుకున్న కార్పొరేట్ అభివృద్ధి నమూనా వల్ల వచ్చే సంక్షోభాలన్నీ సారాంశంలో రాజకీయ సమస్యలే. ఆదివాసులపై జరుగుతున్న మారణకాండ మీద దేశంలో విస్తృత స్థాయిలో రాజకీయ చర్చ జరగవలసి ఉన్నది. వందలాదిగా ఆదివాసుల హత్య, వేలాదిగా అక్రమ కేసులు, అరెస్టులు, మహిళలపై వేధింపులు మొదల్కైన అమానవీయ హింసను రాజకీయార్థిక సాంస్కృతిక సమస్యగా సమాజానికంతా వినిపించాల్సి ఉంది. ఇది కేవలం ప్రచార ఉద్యమంగానేగాక తక్షణం ఆదివాసులపై అణచివేతను నిలువరించే పోరాటంగా మారాలి. ప్రజల తరపున చట్టసభల్లో ప్రాతినిధ్యం వహిస్తున్న రాజకీయ పార్టీలన్నీ ఈ జాతి హననం మీద స్పందించాలి. కేంద్రంలోని బీజేపీ కూటమి నేతృత్వంలో జరుగుతున్న ఈ మారణకాండ మీద మిగతా అన్ని జాతీయ, ప్రాంతీయ పార్టీలన్నీ గొంతెత్తాల్సి ఉన్నది. ఆదివాసులను కాపాడటానికి పౌర సమాజంతోపాటు రాజకీయ పార్టీల జోక్యానికి చాలా ప్రాధాన్యత ఉంది. మేధావుల, ప్రజాసంఘాల చొరవ వల్ల ఆదివాసుల సమస్యలపట్ల చైతన్యం పెరుగుతుంది. సమాజ సున్నితత్వం పెరుగుతుంది. అంతిమంగా ఆదివాసుల హక్కుల పరిరక్షణ రాజకీయ పార్టీల జోక్యంతోనే సాధ్యం అవుతుంది. కేంద్రంలో, చత్తీస్‌ఘడ్‌లో అధికారంలో ఉన్న బీజేపీ విధానాల మీద చట్టసభల్లో ప్రజాప్రతినిధులు చర్చించాల్సి ఉంది. రాజ్యాంగ హక్కులను కాపాడుకోకపోతే మన ప్రజాస్వామ్య వ్యవస్థ ధ్వంసమైపోయి నిరంకుశత్వం స్థిరపడిపోతుంది. ఇప్పటికే బీజేపీ పాలకులు అన్ని రంగాల్లో ఈ పోకడలు పోతున్నారు. దీనికి తాజా ఉదాహరణ చత్తీస్‌ఘడ్‌లో పని చేస్తున్న మూలవాసీ బచావో మంచ్‌ను ఆ రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 30న నిరాధార ఆరోపణలతో నిషేధించడం. ఈ చర్య రాజ్యాంగంలోని భావ ప్రకటనా స్వేచ్ఛకు, సంఘం పెట్టుకొనే హక్కుకు పూర్తి వ్యతిరేకం. ఆదివాసీ హక్కులను కాలరాయడమే కాకుండా, తమ సమస్యల మీద శాంతియుతంగా, చట్టబద్ధంగా పోరాడుతున్న ఆదివాసీ సంస్థను చత్తీస్‌ఘడ్ స్పెషల్ పబ్లిక్ సెక్యూరిటీ యాక్ట్ కింద నిషేధించడం అప్రజాస్వామికం. చట్ట విరుద్ధంగా ఆదివాసీ ప్రాంతాల్లో గనుల తవ్వకానికి అనుమతులు ఇస్తున్న ప్రభుత్వం మూలవాసీ బచావో మంచ్‌ను చట్ట విరుద్ధ సంస్థ అనడం అన్యాయం. బస్తర్ అడవుల్లోని సిలింగేర్ అనే ఆదివాసీ గ్రామంలో మే 13, 2021న ప్రభుత్వం ఏర్పాటు చేసిన సైనిక క్యాంపును ఎత్తివేయాలని కోరుతూ మొదల్కైన పోరాటంలోంచి మూలవాసీ బచావో మంచ్ ఏర్పడిరది. అప్పటి నుంచి ఆదివాసీ యువతీ యువకులు తమ న్యాయమైన హక్కుల కోసం శాంతియుత పద్ధతుల్లో పోరాడుతున్నారు. వాళ్ల సంఘటిత శక్తిని దెబ్బతీయడానికి ఇప్పుడు ఆ సంస్థను నిషేధించారు. సంఘాలను, రాజకీయాలను నిషేధించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో తగనిపని. ఈ చర్య మధ్య భారతదేశంలో ఆదివాసుల మీద కొనసాగుతున్న హింసను, అణచివేతను పూర్తిస్థాయిలో సూచిస్తోంది. దీనికి వ్యతిరేకంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో గత ఆరునెలల కింద ఏర్పడి పని చేస్తున్న ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఢల్లీలో ఈ సదస్సు తలపెట్టింది. వివిధ రంగాల్లో పని చేస్తున్న మేధావులు, జాతీయ, ప్రాంతీయ పార్టీల ప్రతినిధులు పాల్గొంటున్న ఈ రెండు రోజుల జాతీయ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు ఇస్తోంది. ఆదివాసీ హక్కుల సంఘీభావ పోరాట వేదిక

# కాంగ్రెస్‌కు జనబలం ఎప్పుడు లభించేను?

ఎన్ని గట్టి ప్రయత్నాలు చేసినా, ఎంత విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లినా భారతీయ జనతా పార్టీ విస్తృతి, ఉధృతిని ఎందుకు అడ్డుకోలేకపోతున్నాం? గెలిచిన రాష్ట్రాల్లోనే బీజేపీ మరీ మరీ ఎందుకు గెలుస్తోంది? గతంలో కంటే ఎక్కువ ఓట్లు ఎలా సాధిస్తోంది? అసలు ఎక్కడ పొరపాటు జరుగుతోంది? సమీప భవిష్యత్తులో కాంగ్రెస్ అధికారం చేజిక్కించుకోగలదా? అన్న ప్రశ్నలు గత వారం జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి హాజరైన ప్రతి ఒక్కరి మనసుల్లో మెదిలాయి. ఎవరి ముఖాల్లోనూ చిరునవ్వు ఏ కోశానా కనపడలేదు. వారు సాధారణ నేతలు కాదు. ఎన్నో యుద్ధాల్లో ఆరితేరినవారు. ఎంతో అనుభవం ఉన్నవారు. అయినా ఎంతగా తలలు బాదుకున్నా తమ వరుస ఓటములకు కారణాలేమిటో వారు నిర్దిష్టంగా చెప్పలేకపోయారు. నాలుగున్నర గంటల పాటు జరిగిన చర్చలో ఎంతసేపూ బీజేపీ మతపరమైన ఎజెండాను, మోదీ ఉపన్యాసాలను, ఈవీఎంలను నిందించినవారే ఎక్కువగా ఉన్నారు. కేవలం ఈవీఎంల వల్లే మనం ఓడిపోయామా? వేరే కారణాలు లేవా? అన్న ప్రశ్నలపై వర్కింగ్ కమిటీ సమావేశంలో పెద్దగా చర్చించినట్లు లేదు. చివరకు మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలపై మరో కమిటీని వేయాలని నిర్ణయించి చేతులు దులుపుకున్నారు. గతంలో రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, హరియాణా ఎన్నికల్లో ఓడిపోయినప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీ ఇలాంటి అంతర్గత కమిటీలను నియమించింది. ఆ కమిటీలు ఏమి చెప్పాయో, వాటి ఆధారంగా ఏ నిర్ణయాలు తీసుకున్నారో ఎవరికీ తెలియదు. అయినా కమిటీల వల్ల ఏమి జరుగుతుంది? తెలుగుదేశం అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవల హిందూస్తాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో బీజేపీ విజయ రహస్యం గురించి వెల్లడించారు : 'ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎప్పుడూ ఎన్నికలకు తయారీగా ఉంటారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలకు కూడా ఆయన ఇప్పటికే సన్నాహాలు మొదలు పెట్టారు' అని చంద్రబాబు నవ్వుతూ అన్నారు. మహారాష్ట్రలో బీజేపీ ఘన విజయం సాధించిన రోజే నరేంద్రమోదీ బీజేపీ పార్టీ కార్యాలయానికి వచ్చి వేలాది కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. మోదీ, మోదీ అన్న నినాదాలు మిన్నంటుతుండగా 'హమ్ ఏక్ హై తో సేఫ్ హై' (మనం ఒకటిగా ఉంటే సురక్షితంగా ఉంటాం) అని మోదీ మరోసారి ప్రకటించారు. మహారాష్ట్ర ప్రయోగాన్ని దేశమంతటా అమలు చేసేందుకు బీజేపీ ఇప్పటి నుంచే సిద్ధమవుతోంది. 'మనం కనీసం ఒక ఏడాది ముందైనా ఎన్నికలకు సంసిద్ధం కావాలని అర్థం అవుతోంది' అని ఖర్గే వర్కింగ్ కమిటీ సమావేశంలో అన్నారు. మోదీ ఒక ఎన్నికల ఫలితాలు రాకముందే మరో ఎన్నికలకు సిద్ధమయి ఉంటారని కాంగ్రెస్ నేతలు ఇంకా గ్రహించలేదన్న విషయం స్పష్టమవుతోంది. భారతీయ జనతా పార్టీ ఎజెండా, ప్రణాళికకు సంబంధించి ఎవరికీ పెద్ద అనుమానాల్లేవు. మతపరమైన భావోద్వేగాలు, దేశ భక్తిని రంగరిస్తూనే క్రింది స్థాయి నుంచి పార్టీని నిర్మించి ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సమాయత్తమవుతూనే ఉంటుంది. ప్రత్యర్థి పార్టీలను బలహీనపరిచేందుకు వ్యూహాలను నిరంతరం అమలు చేస్తూనే ఉంటుంది. పార్టీకి చెందిన వివిధ అనుబంధ సంస్థలు, సంఘ్ పరివార్ సంస్థలు ఎప్పుడూ సమావేశాలను, సదస్సులను నిర్వహిస్తూ ప్రజలను తమకు అనుకూలంగా తిప్పుకునేందుకు ప్రయత్నిస్తూనే ఉంటాయి. అధికారంలో లేని రాష్ట్రాల్లో కూడా బీజేపీ, సంఘ్ పరివార్ సంస్థలు విస్తృతంగా పనిచేస్తుంటాయి. పోలింగ్ బూత్ స్థాయి నుంచి సూక్ష్మ వ్యూహాలు సిద్ధం చేస్తాయి. వీటన్నిటికి తోడు దేశంలో కనీవినీ ఎరుగని స్థాయిలో అభివృద్ధి జరుగుతోందని, ప్రపంచ దేశాల్లో భారత్ అగ్రరాజ్యంగా మారడం ఖాయమని వివిధ స్థాయిల్లో ఢంకా బజాయిస్తూనే ఉంటారు. వికసిత్ భారత్, స్వచ్ఛ భారత్ వంటి నినాదాలు మారుమ్రోగుతూనే ఉంటాయి. సరే, ఆ పార్టీకి నిధుల కొరత ఏ మాత్రం ఉండదు కదా. గెలిచిన రాష్ట్రాల్లో మళ్లీ గెలిచేందుకు, ప్రతిపక్షంగా మారిన రాష్ట్రంలో మళ్లీ అధికారం చేజిక్కించుకునేందుకు బీజేపీ కసిగా పనిచేస్తుంది. ఓడినా, గెలిచినా తమ ఓటు శాతం తగ్గకుండా చూసుకుంటుంది. అదే కాంగ్రెస్ వరుసగా ఓడిపోయిన సందర్భాలు ఉన్నాయి కాని వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చిన సందర్భాలు ఇటీవలి కాలంలో లేవు. 2014లో కాంగ్రెస్ హరియాణలో గెలిచినప్పటికీ 2019 నుంచి ఓడిపోతూనే వస్తోంది. పంజాబ్‌లో అయిదేళ్లు పాలించి ఆప్‌కు అధికారాన్ని అప్పగించింది. అదే బీజేపీ గుజరాత్, హరియాణాలో వరుసగా మూడుసార్లు గెలిస్తే, అస్సాం, త్రిపుర, గోవా, మణిపూర్, యూపీ, ఉత్తరాఖండ్, మేఘాలయ, నాగాలాండ్, సిక్కింలలో వరుసగా రెండుసార్లు గెలిచింది. అంటే కనీసం డజన్ రాష్ట్రాల్లో బీజేపీ మిత్రపక్షాలు ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమిస్తున్నాయన్నమాట. కాంగ్రెస్‌తో పోలిస్తే తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, జేఎంఎం వంటి ప్రాంతీయ పార్టీలు వరుస విజయాలు సాధించాయి. తెలుగుదేశం ఒకసారి ఓడినా మరోసారి వీరోచితంగా పోరాడి అధికారంలోకి రాగలిగింది. కాంగ్రెస్‌లో ఆ కసి ఎందుకు కనపడడం లేదు? అసలు దేశ అభివృద్ధి నమూనా విషయంలో కాంగ్రెస్ విధానాలకూ, బీజేపీ విధానాలకూ తేడా ఏమైనా ఉన్నదా? 'అదానీ, కులగణన, రాజ్యాంగాన్ని కాలరాయడం ప్రజా సమస్యలు కావా? వాటికి అనుకూలంగా ప్రజలు ఎందుకు స్పందించడం లేదు?' అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వర్కింగ్ కమిటీ సమావేశంలో ప్రశ్నించినట్లు తెలిసింది. అదానీని విమర్శించినంత మాత్రాన కాంగ్రెస్ కార్పొరేటీకరణను వ్యతిరేకిస్తుందని ఎవరైనా అనుకుంటారా? అదానీపై మిత్రపక్షాలలో కూడా ఏకాభిప్రాయం లేదు. కులగణన గురించి ప్రస్తావించినంత మాత్రాన సామాజిక న్యాయం కోసమే కాంగ్రెస్ జన్మించిందని జనం అనుకునే అవకాశాలున్నాయా? ఏ విషయంలో కాంగ్రెస్ తాను బీజేపీ కంటే భిన్నమైన సైద్ధాంతిక సంస్థ అని నిరూపించుకోగలదు? కాంగ్రెస్ పార్టీ రకరకాల సిద్ధాంతాలు ఉన్న పంచకూళ కషాయంలా ఉంటుంది. బీజేపీ దశాబ్దాలుగా ఒకే సిద్ధాంతం ఆధారంగా పనిచేస్తే కాంగ్రెస్ ఒక నిర్దిష్ట సిద్ధాంతాన్ని దీర్ఘకాలం కొనసాగించలేకపోతోంది. మహావికాస్ అగాఢీకి మహారాష్ట్రలో కేవలం ముస్లిం ఓట్లే అధికంగా వచ్చాయని, మహాయుతికి ఓబీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, ఇతర అణగారిన వర్గాల ఓట్లు పెరిగాయని గణాంక వివరాలు చెబుతున్నాయి. మహిళలు, యువకులు మహాయుతివైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. అలా ఎందుకు జరిగింది? 2024 ఎన్నికలకు రెండేళ్ల ముందు పార్టీ ముందున్న సవాళ్లను నిర్ణయించి వాటిని అధిగమించేందుకు కురువృద్ధులైన నేతలతో సోనియా ఒక సాధికార బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం ఏమి చెప్పిందో, చెప్పిన వాటిని అమలు చేశారో, లేదో తెలియదు కాని ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో అనుకున్నంత మేరకు ఫలితాలను సాధించలేకపోయారు. సమకాలీన అంశాలపై చర్చించి పార్టీ దృక్పథాన్ని రూపొందించేందుకు నియమితులయిన సభ్యులు కూడా పార్టీకి నిర్దిష్టమైన సైద్ధాంతిక స్వరూపాన్ని రూపొందించలేకపోయారు. సంస్థాగతంగా చేయాల్సిన పెను మార్పులను సూచించేందుకు గతంలో ఆంటోనీ, అహ్మద్ పటేల్ లాంటి వారితో కమిటీలు వేసినా వారి సూచనలు అమలు అయిన దాఖలాలు లేవు. ఏ పెను మార్పులూ జరగలేదు. నిరంతర ఉద్యమాలు చేసే విషయంపై నిర్ణయించేందుకు, పార్టీని ఆధునికీకరించేందుకు ఏర్పర్చిన కమిటీలు ఏం చెప్పాయో కూడా ఎవరికీ తెలియదు. బహుశా ఈ కమిటీ నివేదికలు ఏఐసీసీ లైబ్రరీలో దుమ్ము కొట్టుకుపోతూ ఉంటాయి! ఇక 'కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలి' అని ఖర్గే అన్నప్పటికీ ఆ నిర్ణయాలు ఎప్పుడు తీసుకుంటారో చెప్పలేము. ముఠాతత్వం, కుమ్ములాటలు కూడా ఒక కారణమని చెప్పిన ఖర్గే పార్టీ అధ్యక్ష స్థానంలో ఉండి వాటిని ఎందుకు అరికట్టలేకపోతున్నారో ఎవరు చెప్పగలరు? 'ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలే అన్ని నిర్ణయాలు తీసుకున్నాయి' అని ఖర్గే సమావేశంలో వాపోవడం గమనార్హం. ాంగ్రెస్‌లో యథాతథ పరిస్థితిని ఆకాంక్షించేవారే ఎక్కువ ఉండడం, సమూలంగా మార్పులు చేసేందుకు పార్టీ అగ్రనేతలు సాహసించకపోవడం వల్ల ఆ పార్టీ బీజేపీని ఢీకొనగల నవనవోన్మేషమైన శక్తిగా ఆవిర్భవించగలదన్న నమ్మకాలు కలగడం లేదు. అందుకు ప్రధాన కారణం వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న పార్టీలో తుక్కూ, తుప్పూ బాగా పేరుకుపోయి ఉండడం. కార్పొరేటర్ స్థానాన్ని కూడా గెలవలేని ఏడు పదులు దాటిన సీనియర్ నేతలు తమ గుర్తింపు కోసం తరుచూ విలేఖరుల సమావేశాలు నిర్వహించడం, ఎవరూ పట్టించుకోకపోయినా తమ అమూల్యమైన అభిప్రాయాలు వ్యక్తం చేయడం కాంగ్రెస్‌లోనే ఎక్కువ కనపడుతుంది. రాహుల్ గాంధీతో పాటు కొందరు నేతలు జనంలోకి వెళుతూ, ప్రజా సమస్యలపై మాట్లాడుతూ, కార్మికులు, యువతతో సంభాషిస్తూ కనపడుతున్నారు. కానీ ఎంతో కష్టపడి కాంగ్రెస్ తమకు అనుకూల వాతావరణాన్ని సృష్టించుకున్నా ఆ వాతావరణం ఓట్లుగా మారేందుకు తగిన పరిస్థితులను కల్పించుకోలేకపోతోంది. 'సానుకూల వాతావరణం ఉంటే చాలదు దాని వల్ల విజయాలు రావు. అను దినమూ ఇరవై నాలుగు గంటలూ పనిచేయాలి' అని ఖర్గే వర్కింగ్ కమిటీ సమావేశంలో సరిగానే అన్నారు.

తెలంగాణ సేన



# హైడ్రాకు భారీగా నిధులు విడుదల..

మంగళవారం (డిసెంబర్ 03న) రోజున.. రూ.50 కోట్ల నిధులు విడుదల చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. హైడ్రా కార్యాలయ నిర్వహణతో పాటు వాహనాల కొనుగోలుకు ఈ నిధులను వినియోగించనున్నట్టు తెలుస్తోంది. దీంతో.. హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలైన నేపథ్యంలో కూల్చివేతలకు బ్రేక్ ఇచ్చిన హైడ్రా.. మరోసారి రంగంలోకి దిగేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. దీంతో.. అక్రమార్కుల గుండెల్లో టెన్షన్ నెలకొంది. హైడ్రా అంటే కేవలం కూల్చివేతలే కాదు నిర్మాణాలు కూడా అంటూ కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పినట్టుగానే.. పలు అభివృద్ధి కార్యక్రమాలకు కూడా శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగానే.. అభివృద్ధిని నోచుకోని, ఆక్రమణలకు గురవుతూ కనమరుగవుతున్న చెరువులు, కుంటలను గుర్తించి.. వాటిని పునరుద్ధరించే కార్యక్రమాలను హైడ్రా చేపట్టింది. ఈ క్రమంలో ఇప్పటికే.. పలు చెరువులు, కుంటలను హైడ్రా అభివృద్ధి చేస్తోంది. ఇదిలా ఉంటే.. ప్రభుత్వ ఆస్తులు కాపాడేందుకు, చెరువులు, కుంటలను అభివృద్ధి చేసి పునరుజ్జీవింపజేసేందుకు గానూ.. హైడ్రాకు మరిన్ని శక్తివంతమైన అధికారాలు ఇవ్వడం కోసం రేవంత్ రెడ్డి సర్కార్ ప్రత్యేక చట్టాన్ని ప్రవేశపెట్టింది. ఈ బిల్లు ద్వారా హైడ్రా అనేక విస్తృత అధికారాలను పొందుతూ.. చెరువులతో పాటు ప్రభుత్వ ఆస్తులను రక్షించటంలో కీలక పాత్ర పోషించనుంది. ఈ మేరకు.. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను అధునాతన సాంకేతిక పద్ధతులు, వాహనాల కొనుగోలు, కార్యాలయ నిర్వహణకు ఉపయోగించనున్నారు. ఈ నిధులు హైడ్రా పనితీరుకు మరింత బలం చేకూరుస్తాయని అధికారులు భావిస్తున్నారు. హైదరాబాద్ నగరంలోని ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, కుంటల పరిరక్షణ కోసం జూలై 19వ తేదీన హైడ్రాను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో 99ను తీసుకువచ్చిన విషయం తెలిసిందే. కాగా.. ఏర్పాటు చేసిన వారం రోజుల్లోనే రంగంలోకి దిగిన హైడ్రా.. జూలై 26 నుంచి కూల్చివేతలను మొదలుపెట్టింది.

ఇప్పటి వరకు 30 ప్రాంతాల్లో 300 ఆక్రమణలను కూల్చివేసింది. హైడ్రా ఏర్పాటు చేసిన 100 రోజుల వ్యవధిలోనే.. 300 అక్రమ నిర్మాణాలకుపైగా నేలమట్టం చేసి.. రాష్ట్రవ్యాప్తంగా ప్రకనంపనలు సృష్టించింది. 100 రోజుల్లో ఏకంగా 120 ఎకరాలను అక్రమార్కుల చెర నుంచి విడిపించి.. ప్రభుత్వానికి అప్పగించింది. జీహెచ్ఎంసీతో పాటు 27 మున్సిపాలిటీలు, 33 గ్రామాల్లోని ఆక్రమణలపై హైడ్రా బుల్డోజర్లు పంజా విసిరాయి. ఈ క్రమంలో.. సినిమా సెలెబ్రిటీలు, రాజకీయ నాయకులు, సామాన్యులు అని తేడా లేకుండా.. అక్రమంగా నిర్మించిన కట్టడాలపైకి దూసుకెళ్లి.. రాష్ట్రవ్యాప్తంగా ఓ సంచలనానికి కేంద్ర బిందువుగా మారింది.

# నటి శోభిత సూసైడ్ కేసు

హైదరాబాద్ గచ్చిబౌలిలో కన్నడ నటి శోభిత ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. గచ్చిబౌలిలోని శ్రీరామ్ నగర్ కాలనీలోని అపార్ట్‌మెంట్‌లో రెండ్రోజుల క్రితం ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆమె సూసైడ్ చేసుకున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన భర్త సుధీర్ రెడ్డి మరో గదిలో నైట్ షిఫ్ట్ చేస్తుండగా.. మరో గదిలో ఆమె ఆత్మహత్య చేసుకున్నారు. మరుసటి రోజు ఉదయం తలుపులు తెరవపకపోటవంతో అనుమానంతో డోర్లు బద్దలుకొట్టి చూడగా.. ఆమె ఫ్యానుకు వేలాడుతూ కనిపించింది. దీంతో భర్త సుధీర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. విచారణ చేపట్టారు. శోభిత ఆత్మహత్య చేసుకున్న ఇంట్లో పోలీసులకు సూసైడ్ నోట్ లభించింది. అందులో 'మీరు సూసైడ్ చేసుకోవాలని అనుకుంటే యు కెన్ డు ఇట్' అని రాసి ఉంది. కాగా, శోభిత డిప్రెషన్‌లో సూసైడ్ చేసుకుందా..? లేక ఇతర కారణాలతో సూసైడ్ చేసుకుందా..? అన్న కోణంలో పోలీసులు ఎంక్వైరీ ముమ్మరం చేసారు. సుధీర్ రెడ్డితో వివాహం తర్వాత ఆమె సీరియల్స్, సినిమాల్లో నటించడం మానేసిన్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. కాగా,శోభిత ఆత్మహత్య ఘటనపై పోలీసులు కుటుంబ సభ్యుల స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. ఆమె తల్లి, అక్కాచెల్లెళ్లు పోలీసుల విచారణలో పలు కీలక విషయాలు వివరించారు. ఆమె సూసైడ్‌పై తమకు ఎలాంటి అనుమానాలు లేవని చెప్పారు. పెళ్లి తర్వాత సీరియల్స్, సినిమాలు మానేసిందని, తెలుగులో అవకాశాల కోసమే కర్ణాటక నుంచి హైదరాబాద్ షిఫ్ట్ అయినట్లు చెప్పారు. ఒంటరిగా ఉండటం, అవకాశాలు రాక డిప్రెషన్‌లోకి వెళ్లి ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చుని కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో వెల్లడించారు. కన్నడ చిత్ర పరిశ్రమకు చెందిన నటి శోభిత.. అటు కన్నడతో పాటుగా తెలుగులోనూ పలు సీరియల్స్‌లో నటించి ప్రేక్షలను మెప్పించారు. కన్నడలో ప్రసారమైన బ్రహ్మగంతు, నినిదలే సీరియల్స్ ద్వారా అక్కడ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగులో ఫస్ట్ డే ఫస్ట్ షో అనే సినిమాలోనూ శోభిత నటించింది. సీరియల్స్ ద్వారా ఫ్యామిలీ ప్రేక్షకులకు దగ్గరైన శోభిత.. హైదరాబాద్ నగరానికి చెందిన సుధీర్ రెడ్డిని మ్యాట్రీమోని సైట్ ద్వారా వివాహం చేసుకుంది. సుధీర్‌తో పెళ్లి తర్వాత ఆమె సీరియల్స్, సినిమాలకు బ్రేక్ ఇచ్చింది. తాజాగా రెండ్రోజుల క్రితం ఫ్యాన్‌కు ఉరేసుకొని ప్రాణాలు తీసుకుంది.

# వరంగల్ జిల్లాలకు రెండు పులులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన విజయోత్సవ కారక్రమాలు చేపట్టగా.. అందులో భాగంగా ఈ నెల 4న అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా జూను ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఫారెస్ట్ అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే కాకతీయ జూపార్కులో పులి ఎన్‌క్లోజర్ పనులు పూర్తికావొచ్చాయి. హైదరాబాద్ నెహ్రూ జూ పార్కు నుంచి వీటిని తీసుకొచ్చారు. నెహ్రూ జూ పార్క్ అసిస్టెంట్ డైరెక్టర్ కె.వై.సుభాష్ నేతృత్వంలో భద్రాద్రి సర్కిల్ ఫారెస్ట్ అధికారి భీమానాయక్, హనుమకొండ జిల్లా ఫారెస్ట్ అధికారి లావణ్య ఈ రెండు పులులను జూకు చేర్చారు. మగ పులి శంకర్ వయసు 10 ఏళ్లు కాగా.. ఆడ పులి కరీనా వయసు 15 ఏళ్లు ఉంటుందని జూ పార్కు అధికారులు వెల్లడించారు. కాకతీయ జూపార్కుకు చేరుకోగానే ఫారెస్ట్‌రేంజ్ అధికారి శిరీష, వెటర్నరీ డాక్టర్ ప్రవీణ్ కుమార్, ఇతర సిబ్బంది పులులను విశ్రాంతి గదుల్లో ఉంచారు. రేపు జూ పార్కు ప్రారంభం తర్వాత.. సందర్శనకు అనుమతి ఇవ్వనున్నారు. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పులి సంచారంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలో ఉన్నారు. ఇప్పటికే ఇద్దరిపై పులి దాడి చేసింది. పులి దాడిలో ఓ యువతి చనిపోగా.. మరో రైతు తీవ్రంగా గాయపడి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం అసిఫాబాద్ జిల్లా ఇటిక్యాల్, పహాడ్, దుబ్బగూడ శివారు ప్రాంతాల్లో పులి సంచారం ఉండగా.. అటుగా వెళ్లేందుకు రైతులు జంకుతున్నారు. పెద్దపులి సంచారంతో పశువులను సయితం దొడ్లకే పరిమితం చేస్తున్నారు. ఇక పులి జాడ కోసం అటవీశాఖ అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. డ్రోన్లు, ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసి పులి కోసం వెతుకాల ప్రారంభించారు. అయితే ఇప్పటి వరకు పులి కెమెరాలకు చిక్కలేదు. దాని పాదముద్రలను మాత్రమే ఫారెస్ట్ అధికారులు గుర్తించారు.

పులి ఫోటో చిక్కితే దాని చారలను బట్టి అది ఏ పులి.. దాని పేరేంటి అన్నది తెలుసుకునే అవకాశముందని ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. ఇటీవల మహారాష్ట్ర నుంచి టైగర్ జానీ అనే పులి ఆడ తోడు, కొత్త ఆవాసం కోసం ఆదిలాబాద్ అడువుల వైపు వచ్చింది. ప్రస్తుతం దాడి చేస్తున్న పులి అదేనా..? లేక ఇప్పటికే అడవిలో రెండు పులులు ఉండగా.. అందులో ఒకటి దాడి చేస్తుందా..? అనేది ప్రశ్నార్థకంగా మారింది. త్వరలోనే పులి జాడ కనుక్కుంటామని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.

# ప్రశ్నించే వాళ్లకు బతికే స్వేచ్ఛ లేదా

హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్ : ములుగు జిల్లా చల్పాక సమీపంలో మావోయిస్టులపై జరిగింది ముమ్మాటికీ బూటకపు ఎన్‌కౌంటరేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. ఆ ఎన్‌కౌంటర్‌పై ప్రభుత్వం వెంటనే జుడీషియల్ ఎంక్వైరీ వేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించే వాళ్ళకు బ్రతికే స్వేచ్ఛ లేదా అని మండి పడ్డారు. మంగళవారం హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. ప్రశ్నించే వాళ్లకు బతికే స్వేచ్ఛ లేదా అని ప్రశ్నించారు. 2026 నాటికి మావోయిస్టులను తుడిచిపెడతామని కేంద్ర మంత్రి అమిత్ షా ప్రకటించడంలోని అర్థం ఏమిటని? కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. ప్రశ్నించే వారికి స్వేచ్ఛ లేదా? వారిని బతకనివ్వరా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మావోయిస్టులు పరిమిత సంఖ్యలోనే ఉండవచ్చని, కానీ వారితో పాటు కమ్యూనిస్టులందరి భావజాలం ప్రశ్నించడమేనని, ప్రశ్నించే వారందరినీ చంపేస్తారా? అని ఆయన ప్రశ్నించారు. అసలు రాష్ట్రంలో జరుగుతున్న ఎన్‌కౌంటర్లు తెలంగాణ ప్రభుత్వానికి తెలిసి జరుగుతున్నాయా? తెలియక జరుగుతున్నాయా? అని ఆయన ప్రశ్నించారు. ఛత్తీస్‌గఢ్ -తెలంగాణ సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో తెలంగాణ పోలీసులు ఎందుకు పాల్గొన్నారని కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. ఇందుకు ప్రభుత్వం బాధ్యత వహించి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకవేళ తెలియకుండా జరిగితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుని జరుగుతున్న పరిణామాలపై సమీక్షించాలని సాంబశివరావు సూచించారు. దేశంలో మానవ హక్కుల పరిరక్షణలో అత్యున్నత న్యాయవ్యవస్థ భాగస్వామ్యం కావాలని,పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగిన సంఘటనలను న్యాయవ్యవస్థ సుమోటోను బాధ్యతగా తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.న్యాయవ్యవస్థ పట్టించుకోనట్లయితే దేశంలో మానవ హక్కులకు స్థానం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

# మహిళా కానిస్టేబుల్ హత్య కేసు

హైదరాబాద్ శివారు ఇబ్రహీంపట్నంలో మహిళా కానిస్టేబుల్ నాగమణి హత్య ఘటన సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ప్రేమించిన వ్యక్తిని కులాంతర వివాహం చేసుకుందన్న కోపంతో సొంత తమ్ముడే ఆమెను కిరాతకంగా హత్య చేశాడు. నాగమణి హయత్‌నగర్ పీఎస్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తుండగా.. స్వగ్రామం రాయపోల్ నుంచి సోమవారం (డిసెంబర్ 2) ఉదయం స్కూటీపై డ్యూటీకీ వెళ్తుండగా.. మార్గమధ్యలోనే ఆమెను కారుతో ఢీకొట్టి, కొడవలితో నరికి ఆమె తమ్ముడు పరమేష్ కిరాతకంగా హత్య చేశాడు. అనంతరం పోలీసులు ఎదుట లొంగిపోయాడు. కాగా, నాగమణి హత్య ఘటనలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నాగమణి తల్లిదండ్రులు పన్నెండేళ్ల క్రితమే చనిపోయారు. దీంతో నాగమణితో పాటు ఆమె అక్క, తమ్ముడు పరమేష్‌ను పెద్దనాన్న పెంచాడు. వీరికి మూడెకరాల భూమి ఉండగా.. ముగ్గురికి సమానంగా పంచారు. అనంతరం నాగమణికి, ఆమె అక్కకు పదేళ్ల క్రితమే వివాహం జరిపించారు. అయితే భార్యభర్తల మధ్య విభేదాల కారణంగా నాగమణి భర్త నుంచి విడాకులు తీసుకుంది. ఆ తర్వాత గ్రామానికే చెందిన శ్రీకాంత్ అనే యువకుడిని ప్రేమించింది.ఈ విషయం తెలిసిన తమ్ముడు పరమేష్ నాగమణిని దూరం పెట్టాడు. దీంతో ప్రేమించిన శ్రీకాంతే ఆమెను హైదరాబాద్‌లోని హాస్టల్‌లో ఉంచి చదివించాడు. ఈ క్రమంలో 2020లో కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైంది. శ్రీకాంత్‌ను ప్రేమించంతో ఆమె పేరుతో ఉన్న ఎకరా భూమిని తనపేరుతో రాయాలని పరమేష్ పలుమార్లు పెద్దమనుషుల పంచాయితీ పెట్టించాడు. దీంతో నాగమణి ఆ భూమిని తిరిగి తమ్ముడి పేరుతో రిజిస్ట్రేషన్ చేసింది. అనంతరం గత నెల 10న యాదగిరి గుట్టలో శ్రీకాంత్‌ను ప్రేమ వివాహం చేసుకుంది. వీరి పెళ్లి విషయాన్ని జీర్ణించుకోలేని పరమేష్.. వాళ్లను చంపేస్తానని బెదిరించాడు. దీంతో నాగమణి-శ్రీకాంత్ దంపతులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసుల ఎదుటే ఏనాటికైనా చంపేస్తానని వార్నింగ్ ఇచ్చారు. ఆ తర్వాత కొద్ది రోజులకు తన ఆస్తిలో వాటా అడనని బాండ్ రాసివ్వాలంటూ ఆమెపై ఒత్తిడి తెచ్చాడు. అందుకు నాగమణి ఒప్పుకోలేదు.

దానికి తోడు ఇటీవల పరమేష్‌కు వివాహం కుదరగా.. అక్క విషయం తెలిసి అమ్మాయి తరపు వాళ్లు పెళ్లి క్యాన్సిల్ చేసుకున్నారు. వీటన్నింటిని పరమేష్ మనసులో పెట్టుకున్నాడు. కులాంతర వివాహం చేసుకోవంటతో పాటుగా.. ఎకరా పొలం వివాదం ఉండటం.. ఈ రెండు ప్రధాన కారణాలతో పాటు తన పెళ్లి చెడిపోవటానికి అక్కే కారణమని కక్ష పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో మాటు వేసిన పరమేష్ ఆమెను కారుతో గుద్ది, కొడవలితో నరికి కిరాతకంగా హత్య చేసింది.

# మాజీ మంత్రి హరీష్ రావు పై కేసు నమోదు

హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్ : మాజీ మంత్రి హరీశ్ రావుపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. తన ఫోన్‌ను ట్యాపింగ్ చేశారని సిద్దిపేటకు చెందిన చక్రధర్ గౌడ్ జూబ్లీహిల్స్ ఏసీపీకి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో హరీశ్‌రావుపై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. 120 (బీ), 386,409,506 , రెడ్ విత్ 34, ఐటీ యాక్ట్ సెక్షన్ల కింద పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. జగదీశ్ రెడ్డి పై అక్రమ కేసు బనాయించారని బి ఆర్ ఎస్ నేత దేవిప్రసాద్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనపై సంబురాలు చేస్తున్నారని.. రేవంత్ రెడ్డి ఏడాది తీసుకొచ్చింది ప్రజా పాలన కాదని..పోలీసుల రాజ్యమని విమర్శించారు. నక్సలైట్లు ఉండాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాట్లాడిన రేవంత్ రెడ్డి ఇప్పుడు ఎన్‌కౌంటర్లు చేయిస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ఎన్ని నిర్బంధాలు పెట్టినా తాము నిద్రపోకుండా ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

# ఇండ్లులేని పేదలకు తీపి కబురు..

తెలంగాణ కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రధాన హామీల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకం కూడా ఒకటి. తాము అధికారంలోకి వస్తే.. ఇండ్లులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చింది. ఖాళీ జాగా ఉన్న పేదల ఇళ్ల నిర్మాణానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తామన్నారు. జాగాలేని వారికి జాగాతో పాటుగా.. రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిచనున్నట్లు ప్రకటించారు. ఈ హామీ అమలు కోసం తెలంగాణలోని ఇళ్లులేని పేదలు చాలా కాలంగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై రేవంత్ సర్కార్ కీలక అప్డేట్ ఇచ్చింది. డిసెంబర్ మొదటి వారంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ఇది వరకే ప్రకటించిన విషయం తెలిసిందే. సీఎం ప్రకటన నేపథ్యంలో గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక అప్డేట్ ఇచ్చారు. ఈనెల 5 నుంచి ఇందిరమ్మ ఇళ్ల యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. సీఎం రేవంత్ చేతుల మీదుగా ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభిస్తామని మంత్రి పొంగులేటి చెప్పారు. తెలంగాణ వ్యాప్తంగా మొదటి విడతగా 4.5లక్షల ఇళ్లు మంజూరు చేయనున్నట్లు మంత్రి పొంగులేటి వెల్లడించారు. ప్రతి నియోజకవర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. వీటికోసం ఇప్పటికే.. రూ.3 వేల కోట్లను కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలను సైతం నియమించినట్లు తెలిపారు. రాబోయే నాలుగేళ్లపాటు ఇందిరమ్మ ఇళ్లు పంపిణీ కొనసాగుతోందన్నారు. ఇక ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికపై సీఎం రేవంత్ ఇటీవల కీలక కామెంట్స్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అత్యంత నిరుపేదలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ముఖ్యంగా దివ్యాంగులు, వ్యవసాయ కూలీలు, సాగుభూమి లేని వారు, పారిశుద్ధ్య కార్మికులు.. ఇలా ప్రాధాన్యత క్రమాన్ని ఎంచుకోవాలని చెప్పారు. తొలి దశలో సొంత స్థలాలున్న వారికే ప్రాధాన్యత ఇస్తున్న కారణంగా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో గ్రామ కార్యదర్శితో పాటు మండల స్థాయి అధికారులను బాధ్యులను చేయాలన్నారు. అందుకోసం అవసరమైన సాంకేతికతను వినియోగించుకోవాలని.. ఇందిరమ్మ యాప్‌లో ఎలాంటి లోపాలు, లోటుపాట్లు లేకుండా చూడాలని సీఎం రేవంత్ ఆదేశించారు. ఆదివాసీ ప్రాంతాలు, ఐటీడీఏల పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ప్రత్యేక కోటా ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులు ఎవరైనా ఇందిరమ్మ ఇళ్లకు అదనంగా గదులు నిర్మించుకోవాలని ఆసక్తి చూపితే అందుకు అవకాశం కల్పించాలని సీఎం రేవంత్ అధికారులకు సూచించారు.

## న్యూయార్క్, టోక్యోతో సమానంగా హైదరాబాద్

హైదరాబాద్ మహానగరం ప్రపంచంతో పోటీ పడుతోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. న్యూయార్క్, టోక్యో నగరాలతో సమానంగా హైదరాబాద్‌ను నడిపిస్తామని చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో రెండో అతిపెద్ద ఫ్లైఓవర్‌ను రేవంత్ రెడ్డి ప్రారంభించారు. మంగళవారం (డిసెంబర్ 3) రోజున.. జూ పార్క్ నుంచి ఆరాంఘర్ వరకు నిర్మించిన ఆరు లేన్ల బైడైరెక్షనల్ ఫ్లైఓవర్‌ను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ ఫ్లైఓవర్‌ను రూ. 636 కోట్లతో 24 మీటర్ల వెడల్పు, 4.4 కిలోమీటర్ల వెడల్పుతో నిర్మించారు. ఈ క్రమంలో నిర్వహించిన సభలో సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవెలప్మెంట్ విభాగం పరిధిలో రూ.5827 కోట్లతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను సీఎం రేవంత్ రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. జీహెచ్ఎంసీ పరిధిలో %ఎజ×ు×% ఫేజ్-1లో రూ.3446 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు సీఎం రేవంత్ రెడ్డి. ఇప్పటికే ఈ పనులకు రేవంత్ రెడ్డి సర్కార్.. పరిపాలన అనుమతులు మంజూరయ్యాయి. రహదారులు, జంక్షన్ల సుందరీకరణకు రూ.150 కోట్ల పనులకు శంకుస్థాపన చేయగా.. సిటీలో వరదనీరు నిలవకుండా వర్షపు నీటి సంరక్షణ, వరద నీటిని నియంత్రించే పనులకు రూ.17 కోట్ల అంచనాలతో చేపట్టే పనులను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అంతేకాకుండా.. హైదరాబాద్ జల మండలి ఆధ్వర్యంలో నిర్మించిన మురుగు నీటిని శుద్ధి చేసే ప్లాంట్లను కూడా సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. రూ.669 కోట్ల అంచనాలతో ఈ ప్లాంట్లను ప్రభుత్వం చేపట్టింది. తాగునీటి సరఫరాకు ఔటర్ రింగ్ రోడ్డు చుట్టూ వివిధ ప్రాంతాల్లో రూ.45 కోట్లతో చేపట్టిన 19 రిజర్వాయర్లను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. వీటితో పాటు.. హైదరాబాద్ రోడ్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.1500 కోట్లతో రోడ్లను అభివృద్ధి చేసే ప్యాకేజీతో పాటు గతంలో పెండింగ్లో ఉన్న పనులకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనుసంధానంతో కొత్త ఆన్‌లైన్ బిల్డింగ్ అప్రూవల్, లేఅవుట్ అప్రూవల్ సాఫ్ట్ వేర్‌ను ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ విధానం 2025 ఫిబ్రవరి నుంచి అమల్లోకి రానుంది.

## విద్యార్థితో అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు

విద్యాబుద్ధులు నేర్పి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాల్సిన ఓ టీచర్ దారి తప్పాడు. వక్ర బుద్ధితో కూతురు వయసున్న ఓ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆ ఉపాధ్యాయుడిని తమదైన స్టైల్‌లో నడిరోడ్డుపై చెప్పులతో చితకబాది బడిత పూజ చేశారు. పిల్లలను కంటికి రెప్పలా కాపాడాల్సింది పోయి కీచకంగా ప్రవర్తిస్తావా అంటూ వీపు విమానం మోత మోగించారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా విద్యాశాఖాధికారి విచారణ చేపట్టగా సంచలన విషయాలు బయటకొచ్చాయి. విద్యార్థులనే కాదు తోటి ఉపాధ్యాయురాళ్లతో కూడా అసభ్యంగా ప్రవర్తిస్తూ కీచకంగా ప్రవర్తించాడని తేలింది. అంతే వెంటనే సస్పెన్షన్ వేటువేస్తున్నట్టు విద్యాశాఖ అధికారి ప్రకటన విడుదల చేశాడు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో తెలుగు టీచర్‌గా పని చేస్తున్న సత్యనారాయణను విద్యార్థిని తల్లిదండ్రులు చితకబాదారు. అదే పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని రోడ్డు మీద చెప్పులతో బాలిక తల్లిదండ్రులు బడిత పూజ చేశారు. కన్న కూతురు వయస్సున్న ఆడబిడ్డతో వ్యవహరించే తీరు ఇదా అంటూ వీపు విమానం మోత మోగించారు. స్కూలుకు వెళ్లి నిలదీసే సమయంలో గోడ దూకి పారిపోయేందుకు ప్రయత్నించిన సత్యనారాయణను నడిరోడ్డులో దొరక బట్టుకుని ఎడాపెడా చెప్పులతో విద్యార్థిని తల్లిదండ్రులు చెంపలు వాయించారు. ఈ దాడి ఘటన వీడియోలను అక్కడి స్థానికులు తమ సెల్ ఫోన్లలలో రికార్డ్ చేసి సోషల్ మీడయాలో వైరల్ చేయడంతో ఈ ఘటన జిల్లా కేంద్రంలో సంచలనంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న మంచిర్యాల జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య వివరాలు సేకరించారు.. తోటి ఉపాధ్యాయులను ఆరా తీయగా సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. తనతో పాటు పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయురాళ్ల పట్ల కూడా అసభ్యకరంగా ప్రవర్తించే వాడని తేలింది. దీంతో కీచక ఉపాధ్యాయుడైన సత్యనారాయణను సస్పెండ్ చేస్తున్నట్లు డీఈవో యాదయ్య ప్రకటించారు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో లోతుగా విచారణ జరుపుతామని.. పోలీసులకు సైతం ఫిర్యాదు చేస్తామని డీఈవో యాదయ్య తెలిపారు



# పాతాళానికి రూపాయి

అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ చరిత్రలో ఎప్పుడూ లేని స్థాయిలో పతనం అయ్యింది. సోమవారం అమెరికా డాలర్‌తో రూపాయి మారకం విలువ 13 పైసలు క్షీణించి 84.73 కనిష్ట స్థాయికి దిగజారింది. ఇది రూపాయి చరిత్రలోనే అత్యంత పేలవ విలువ. దేశ ఆర్థిక వ్యవస్థలో చోటు చేసుకుంటున్న అత్యంత బలహీనమైన గణాంకాలు రూపాయి విలువను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తోన్నాయి. మరోవైపు అమెరికాకు ట్రంప్ అధ్యక్షునిగా ఎన్నికైన తర్వాత పరిస్థితి మరింత కఠినంగా మారింది. బ్రిక్స్ దేశాలపై 100 శాతం టారిఫ్ పన్నులు ఉండొచ్చన్న సంకేతాలు రూపాయిని మరింత పడిపోయేలా చేసింది. ఇప్పటికే డాలర్ బలపడటానికి తోడు దేశీయ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత మదుపర్లు వరుసగా ఈక్విటీలను తరలించుకు పోతున్నారు. మరోవైపు చమురు ధరలు పెరగడమూ, భారత ఎగుమతులు పడిపోవడం, వాణిజ్యలోటు పెరగడం, ఇతర విదేశీ చెల్లింపుల భారం రూపాయి విలువను అధ:పాతాళానికి జారుకునేలా చేస్తున్నాయి. భారత తయారీ రంగం నేలచూపులు చూడటం, జీడీపీ అంచనాలను చేరకపోవడం, ఆర్‌బీఐ వద్ద విదేశీ మారకం నిల్వలు క్రమంగా తరిగి పోవడం తదితర అంశాలు ప్రతికూలతను పెంచాయి. ఇంటర్ బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో రూపాయి విలువ 84.59 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 84.73 కనిష్ట స్థాయిని తాకి.. తుదకు అదే స్థాయిలో ముగిసింది. రూపాయి విలువ పడిపోవడంతో దిగుమతులు భారం కావడంతో పాటు విదేశీ అప్పులపై అధికంగా చెల్లింపులు చేయాల్సి వస్తుంది. ఇప్పటికే భారత ఆర్థిక వ్యవస్థలో ప్రమాదకర ఘంటికలు మోగుతోన్న వేళ.. రూపాయి పతనం మరిన్ని చిక్కులను తెచ్చిపెట్టనుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# చమురు ఉత్పత్తులపై విండ్‌ఫాల్ టాక్స్ రద్దు

చమురు ఉత్పత్తులపై మోడీ సర్కార్ విండ్‌ఫాల్ టాక్స్‌ను రద్దు చేసింది. పెట్రోల్, డీజిల్, ఎవియేషన్ టర్బైన్ ఫ్యూయల్, ఇతర చమురు ఉత్పత్తుల ఎగుమతులపై విధిస్తున్న విండ్‌పాల్ ట్యాక్స్‌ను రద్దు చేయడం ద్వారా రిలయన్స్ ఇండిస్టీస్, ఒఎన్‌జిసి సంస్థలకు ఆదాయాలు పెరగనున్నాయి.


సోమవారం ఈ పన్నులను ప్రధాన మంత్రి కార్యాలయం సమీక్షించి నిర్ణయం తీసుకుంది. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గుముఖం పట్టడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. చమురు ఉత్పత్తుల ఎగుమతులపై 2022 జులై 1 నుంచి కేంద్రం విండ్‌ఫాల్ టాక్స్ అమలు చేస్తోంది. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరిగినప్పుడు ఆయా కంపెనీలకు పెద్దఎత్తున లాభాలు వస్తాయి. ఆ సమయంలో విధించే పన్నునే విండ్‌ఫాల్ ట్యాక్స్‌గా పేర్కొంటారు. రెండు



వారాల సగటు చమురు ధరల ఆధారంగా ప్రతి 15 రోజులకోసారి ఈ పన్నులను కేంద్రం సమీక్షిస్తోంది. అంతర్జాతీయంగా చమురు ధర గత కొన్ని నెలలుగా 72-75 డాలర్ల మధ్య కదలాడుతోంది.

# ట్రంప్ టారీఫ్‌లతో బ్రిక్స్ దేశాలకు ముప్పు

అమెరికా డాలర్‌కు దూరంగా ఉంటే బ్రిక్స్ దేశాలు 100 శాతం టారిఫ్‌లను ఎదుర్కోవాల్సి వస్తుందని అమెరికా నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికను ఆర్‌బిఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు విమర్శించారు. ఈ పరిణామం బ్రిక్స్ దేశాలకు ముప్పులాంటిందన్నారు. ఆర్థిక సవాళ్ల కారణంగా దాని సాధ్యత, చట్టబద్ధతపై మరింత స్పష్టత రావాల్సి ఉందన్నారు. ట్రంప్ టారీఫ్ విధానానికి



అమెరికా చట్టం అనుమతిస్తుందో లేదో చూడాలన్నారు. యుఎస్ డాలర్‌కు ప్రత్యామ్నాయాన్ని తీసుకురావడంలో బ్రిక్స్ దేశాల్లో అంతర్గత విభేదాలు ఉన్నాయన్నారు. భారత్, రష్యా, చైనా, బ్రెజిల్‌లను కలిగి ఉన్న తొమ్మిది సభ్య దేశాలు అమెరికా కరెన్సీ ప్రత్యామ్యాయానికి చొరవ తీసుకోవాలన్నారు. బ్రిక్స్‌లోని కీలక దేశాలు రష్యా, చైనా కొన్ని రోజులుగా ప్రత్యామ్నాయాన్ని కోరుతున్నాయన్నారు. భారత్ ఇప్పటి వరకు ఈ చర్యలో భాగం కాలేదన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో పన్ను వసూళ్లు భేష్



తెలుగు రాష్ట్రాల్లో పన్ను వసూళ్లు మెరుగ్గా ఉన్నాయని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కం టాక్స్ మిథాలి మదుస్మిత అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1,21,000 కోట్ల ఆదాయపు పన్ను వసూళు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటికే రూ.59,000 కోట్లు వసూళ్లు చేసినట్లు తెలిపింది. గతేడాదితో పోల్చితే తెలంగాణలో 15 శాతం వృద్ధి చోటు చేసుకుందన్నారు. అయితే తెలంగాణతో పోల్చితే ఆంధ్రలో అంత ఆశాజనకంగా లేదన్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఎఫ్‌టిసిసిఐ ఏర్పాటు చేసిన ఓ సమావేశంలో మిథాలి మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లో నిర్దేశించుకున్న పన్ను వసూళ్ల లక్ష్యాన్ని చేరుతామని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు రెండు రాష్ట్రాల్లో రూ.2 లక్షల కోట్ల పన్ను వసూళ్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇందులో కొన్ని వివాదంలో ఉన్నాయని తెలిపారు.

ప్రపంచంలోనే భారత్ అత్యంత ప్రగతిశీల పన్ను విధానం గల దేశమన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం, ప్రభుత్వ వ్యయాల కోసం ఎక్కువ ఆదాయాన్ని రాబట్టడం తమ కర్తవ్యమన్నారు.

# ఈ ఎయిర్ టెల్ రీఛార్జ్ ప్లాన్ మీ కోసమే!

ఒకప్పుడు ఫోన్లో ఏదైనా చిన్న వీడియో, ఫైల్, ఫొటోస్ డౌన్లోడ్ చేయడానికి మొబైల్ డేటా అవసరం ఉండేది. అప్పట్లో మొబైల్ డేటా చాలా ఖరీదైనదిగా ఉండేది. దీంతో అవసరం ఉన్నప్పుడు మొబైల్ డేటాను వాడుకొని మిగతా సమయంలో నెట్ ఆఫ్ చేసుకునేవారు. కానీ, ఎప్పుడైతే జియో టెలికం రంగంలోకి ప్రవేశించిందో ఇది మరింత సులభంగా అయిపోయింది. ఇటీవల టెలికాం సంస్థలు రీఛార్జ్ ప్లాన్లు పెంచిన విషయం అందరికీ తెలిసిందే. ఇందులో భాగంగానే అనేక టెలికాం సంస్థలు తమ కస్టమర్లను ఆకర్షించుకోవడానికి అనేక కొత్త ప్లాన్లను ప్రవేశపెడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఎయిర్ టెల్ ప్రవేశపెట్టిన రూ.1199 ప్లాన్ గురించి పూర్తిగా తెలుసుకుందాం. ఎయిర్‌టెల్ రూ.1199 ప్లాన్. డేటా: ఈ ప్లాన్‌లో మొత్తం 210%+దీ% డేటాను అంటే 2.5GB డేటాను ప్రతిరోజూ పొందొచ్చు. వాలిడిటీ: ఈ ప్లాన్ వాలిడిటీ 84 రోజులు. కాలింగ్: ఇందులో అపరిమిత వాయిస్ కాల్స్ సౌకర్యం లభిస్తుంది. ఎస్ ఏం



ఎస్: ప్రతిరోజూ 100 ఉచిత SMSలను పంపవచ్చు. ఓటిటి సబ్‌స్క్రిప్షన్: ఇది అమెజాన్ ప్రైమ్ 3 నెలల ఉచిత సబ్‌స్క్రిప్షన్, వింక్ మ్యూజిక్‌కి ఉచిత యాక్సెస్‌ను కూడా పొందుతుంది.

# పసిడి ప్రియులకు గుడ్ న్యూస్..

దేశంలోని ప్రజలందరూ పండగలు, పెళ్ళిళ్ళు అంటూ అనేక సంధర్భాల్లో బంగారం కొనుగోలు చేస్తూనే ఉంటారు. ధర ఎంత అయినా ఉండని సందర్భాన్ని బట్టి కొనుగోలు చేస్తారు. అయితే బంగారం ధరలు స్థిరంగా అసలు ఉండవు. ధరలు రోజురోజుకి పెరుగుతూనే ఉంటాయి. ఒకసారి ధరలు పెరుగుతే మరోసారి తగ్గుతాయి. ఈ క్రమంలో బంగారం కొనడానికి ప్రజలు వెనకడుతారు. బంగారం ధరల్లో ప్రతిరోజు హెచ్చుతగ్గులు కనిపిస్తుంటాయి. నిన్నటి తో పోల్చుతే ఈరోజు అనగా డిసెంబర్ 2వ తేదీ సోమవారం నాడు 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాము రూ. 7,1490లు ఉంటె.. 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాముల ధర రూ. 7,7990లుగా ఉంది. ఇప్పుడు దేశ వ్యాప్తంగా అన్ని ప్రధాన నగరాల్లో, తెలుగు రాష్ట్రాల్లో బంగారం తాజా ధరలను తెలుసుకుందాం.

# శత వసంతాల మాలపల్లి నవల

గాంధేయ వాదిగా, న్యాయ వాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య యోధుడుగా, ఉద్యమ నాయకునిగా, స్త్రీ విద్య ప్రోత్సాహికునిగా, కాంగ్రెస్ నేతగా, దళిత జనోద్ధారకునిగా, ప్రధానంగా తెలుగు నవలా సాహిత్య వైతాళికుడుగా ఉన్నవ లక్ష్మీ నారాయణ తెలుగు వారికి సుపరిచితుడే. ముఖ్యంగా నాటి సాంఘిక దురాచారాలను ప్రతిబింబించే, మాలపల్లి నవల నాడు ఒక సంచలనమే.సాంఘిక, ఆర్థిక అసమానతలను తొలగించి, కుల వ్యవస్థను నిరసించి, అందరూ సమానులే అన్న భావనతో, అగ్రవర్ణాలు, హరిజనులు అందరూ కలసి మెలసి ఉండాలని కోరుకుంటూ, "మాలపల్లి" అనే విప్లవాత్మకమైన నవలను రచించడం, తన దృక్పథానికి మద్దతుగా, "సహ పంక్తి భోజనాలు" నిర్వహించడం ఆ రోజులలో సాహసమే. మాలపల్లి తెలుగు సాహితీ చరిత్రలోనూ, సామాజిక దృక్పథంలోనూ ఒక నూతన ఒరవడిని సృష్టికి, చర్చోప చర్చలకు కారణభూతమైంది. ఒక దళిత కుటుంబం సమా జంలో కలిసి మెలసి ఉండడానికి చేసే ప్రయత్నం, సదరు ప్రయత్నంలో ఎదురైన చేదు అనుభవాలు, ఆ అనుభవాలతో రాటుదేలిన వ్యక్తులు చైతన్యమై సంఘటి తమై సమాజంలో నిర్లక్షం చేయబడ్డ తమ ఉనికి కోసం, మెరుగైన స్థానం కోసం చేసే పోరాటాలు వంటి అంశాలతో మాలపల్లి నవలలోని పాత్రలు ఉదాత్తంగా చిత్రీకరించ బడ్డాయి. సామాజిక మార్పు కోసం బలహీన దళిత, పీడిత వర్గాలు చైతన్యంతో సుసంఘ టితం కావాలని, పోరాటా లకు సిద్ధపడాలని మాలపల్లి ప్రబోధించింది. 1922లో పల్నాడు పుల్లరి సత్యాగ్రహంలో పాల్గొని అరెస్టయి రాయ వెల్లురు జైలుకు ఉన్నవ లక్ష్మీనారాయణ తరలించ బడిన సమయం లోనే అక్కడే తన లక్ష్య సాధనకై విప్లవాత్మకమైన తెలుగు నవలా సాహిత్యంలో చిరస్మరణీయమైన 'మాలపల్లి' నవలను ఆయన రచించారు. మాలపల్లి నవల దళిత కుటుంబాన్ని ప్రధాన కథాశంగా రచించిన తొలి రాజకీయ నవల. 1922 లో మాలపల్లి నవలను బెల్లంకొండ రాఘవరావు ముద్రించగా, మద్రాసు ప్రభుత్వం మాలపల్లి నవలపై నిషేధం విధించింది. రాజకీయ వాతావర ణాన్ని, గాంధీ మహాత్ముని



ఆశయాల్ని, తెలుగువారి జీవన విధానాన్ని ప్రతిబింబించిన నవల మాల పల్లి. ఆ నవలలో సాంఘిక దురాచారాలు, జాతీయ సత్యాగ్రహ ఉద్యమాలు, వర్ణ , వర్గ వ్యత్యాసాలు తదితర ఆ నాటి పరిస్థితులను కల గలిపి, కళ్ళకు కట్టినట్లు ఉన్నవ చిత్రించడం విశేషం. ఆనాడు హరిజనుల కుటుంబ గాథను ఇతివృత్తంగా ఎన్నుకొని నవల వ్రాయడమే సాహసం. 1926 లో మద్రాసు శాసన మండలిలో మాలపల్లి నిషేధంపై చర్చలు జరగడం, 1928 లో కొన్ని మార్పులతో మాలపల్లి ప్రచురణకు తిరిగి అనుమతి లభించడం, మద్రాసు ప్రభుత్వం ఆంధ్ర విశ్వ విద్యాలయం మాలపల్లిని ప్రచురించి, ఆ నవలను పాఠ్య గ్రంథంగా ఎంపిక చేయడం, 1936 లో మద్రాసు ప్రభుత్వం మాలపల్లి నవలపై రెండోసారి నిషేధం తెలిపి ఆ నవలను పాఠ్య గ్రంథంగా తొలగించడం, 1937లో చక్రవర్తుల రాజగోపాలాచారి మద్రాసు ప్రధానిగా ఎన్నికైనప్పుడు తొలి కాంగ్రెసు మంత్రి వర్గంచే మాలపల్లి నవలపై నిషేధపు ఉత్తర్వులను రద్దు చేయించడం క్రమానుగతంగా జరిగి పోయాయి. సామాన్య ప్రజల సంక్షేమం, అభ్యుదయాన్ని కోరే కవిత్వం ప్రజలకు సులభంగా అర్థమయ్యే వాడుక భాషలో ఉండాలన్న లక్ష్యంతో మాలపల్లి నవలలో చరమ గీతం, సమతా ధర్మం అనే రెండు గేయ కవితల్ని సామాన్య ప్రజలకు అర్థమయ్యే నిత్య వాడుక భాషలో జానపద గేయ రీతుల్లో రచించాడు. ఆ నవలకు కాశీనాథుని నాగేశ్వర రావు పీఠిక వ్రాస్తూ, "ఆంధ్ర సాహిత్య హృదయ పరిణామా న్ని గ్రహించడానికి మాలపల్లి ఉత్తమ కావ్యం అని, తెనుగు మాటలు, తెనుగు దేశము, తెనుగు హృదయము, తెనుగు సంకల్పము, మాలపల్లి నవలకు అనిర్వచనీయ ప్రతిభను సమ కూర్చాయి" అని కొనియాడాడు. అందుకే తెలుగు సాహిత్యంలో వచ్చిన తొలి విప్లవ నవలగా గుర్తింపు పొందింది.ఆయన సాహిత్యం ద్వారా హరి జనోద్ధరణకు కృషి చేశాడు. గుంటూరులో శ్రీ శారదా నికేతన్ ను స్థాపించి, స్త్రీ విద్యను ప్రోత్సహించాడు. కందుకూరి వీరేశలింగం పంతులు అధ్యక్షతలో తొలి వితంతు వివాహం జరిపించిన సంస్కర్తగా నిలిచాడు. రష్యాలో 1917లో జరిగిన బోల్షవిక్ విప్లవం వల్ల స్ఫూర్తి పొందిన మొదటి తెలుగు కవి ఉన్నవ. కూలీల పక్షం వహించి కవులు రచనలు చేయడానికి ప్రేరణ నిచ్చింది సదరు రష్యా విప్లవ ప్రభావమే. ఉన్నవ... మాల పల్లి, నాయకురాలు, బుడ బుక్కల జోస్యం, స్వరాజ్య సోది, భావ తరంగాలు తదితర రచనలు చేశాడు.

గాంధేయ వాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య యోధు నిగా తెలుగు నవలా సాహిత్య వైతాళికుడుగా కీర్తి పొందిన ఉన్నవ లక్ష్మీనారాయణ గుంటూరు జిల్లా అప్పటి సత్తెనపల్లి తాలూకా వేములూ రు పాడు గ్రామంలో 1877 డిసెంబరు 4న జన్మించి, 1958 సెప్టెంబరు 25 న మరణించాడు.

తెలంగాణ సేన



# కొనసాగుతున్న ఫెంగల్ తుపాను బీభత్సం



చెన్నై : తమిళనాడు, పుదుచ్చేరిలో ఫెంగల్ తుపాను బీభత్సం కొనసాగుతోంది. తమిళనాడులో తిరువన్నమలై పట్టణం అన్నమలైయార్ హిల్ వద్ద ఆదివారం సాయంత్రం నివాస భవనంపై కొండచరియలు విరిగిపడ్డాయి. ఆ సమయంలో భవనంలో ఉన్న ఏడుగురిలో ఐదుగురి మృతదేహాలను సోమవారం వెలికితీశారు. మిగిలిన వారి కోసం గాలింపు కొనసాగుతోంది. మృతుల్లో ఒక మహిళ, ఒక చిన్నారి ఉన్నారు. స్థానికుల సమాచారం ప్రకారం ఈ భవనంలో రాజ్‌కుమార్, మీనా దంపతులు తమ ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్నారు. మీనా సోదరుడి మరో ముగ్గురు పిల్లలు కూడా వీరితో కలిసి ఉంటున్నారు. ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలతో పాటు స్థానిక పోలీసులు, ఫైర్ సిబ్బంది సహాయక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. చెన్నై ఐఐటికి చెందిన సాంకేతిక నిపుణులు కూడా వీరికి సహాయం చేస్తున్నారు. తమిళనాడు నీలగిరి జిల్లా ఊటీ నొండిమేడు వద్ద భారీ వర్షాల కారణంగా బలహీనపడిన ఇళ్లు సోమవారం తెల్లవారుజామున కూలిపోయిందని, ప్రమాదంలో 45 ఏళ్ల ఆరుముగం మరణించాడని అధికారులు తెలిపారు. తమిళనాడులోని విల్లుపురం, కళ్లకురిచ్చి, తిరువణ్ణామలై జిల్లాల్లో దాదాపు 1,29,000 హెక్టార్లలో పంటలు నీట మునిగాయని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ సోమవారం తెలిపారు. తుపాను నష్టంపై సమగ్ర నివేదికను కేంద్రానికి సమర్పిస్తామని, నష్టపోయిన వారందరికీ సాయం అందిస్తామని చెప్పారు. రాష్ట్రంలో సోమవారం కూడా వర్షాలు కురిసాయి. విల్పురం జిల్లాలో వరదలు సంభవించాయి. వంతెనలు, రోడ్లు మునిగిపోయాయి. రైల్వే ట్రాక్‌లపై నీరు నిలిచిపోవడంతో కొన్ని రైళ్లను రద్దు చేశారు. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. క్రిష్ణగిరి జిల్లా ఊతరగరై, పోచంపల్లి తాలుకాల్లో భారీ వర్షాలకు రోడ్లపై నీరు ఉధృతంగా ప్రవహించింది. జాతీయ రహదారులకు అనుసంధానం తెగిపోయింది. ఉత్తంగరై హైవేపై పక్కన నిలిపి ఉంచిన బస్సులు వరద నీటిలో కొట్టుకుపోయాయి. ఈ రెండు తాలుకాల్లో మంగళవారం కూడా విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. ఈ జిల్లాల్లో అన్నామలై యూనివర్శిటీ పరీక్షలను వాయిదా వేసింది. పుదుచ్చేరిలోనూ వర్షాల కారణంగా నలుగురు మరణించారని ముఖ్యమంత్రి ఎన్ రంగసామి తెలిపారు. మృతుల కుటుంబాలకు ఒక్కొరికి రూ 5 లక్షల చొప్పున పరిహారం అందజేస్తామని చెప్పారు. ప్రజా పంపిణీ వ్యవస్థ కింద 3.54 లక్షల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 వేలు సహాయం అందజేస్తామని ప్రకటించారు. బ్యాంక్ ఖాతాలకు నేరుగా జమ చేస్తామని తెలిపారు. ఈ నెల 3, 5 తేదీల్లో జరగాల్సిన పరీక్షలను పుదుచ్చేరి యూనివర్శిటీ రద్దు చేసింది. తాజా తేదీలను త్వరలో ప్రకటిస్తామని అసిస్టెంట్ రిజిస్ట్రార్ తెలిపారు. ఈ నెల 6 నుంచి జరగాల్సిన పరీక్షలు యథావిధిగా జరుగుతాయని చెప్పారు.



# కావాలనే మానవతా సాయాన్ని అడ్డుకుంటున్న ఇజ్రాయిల్

గాజా : పాలస్తీనియన్ల కోసం గాజాలోకి వస్తున్న మానవతా సాయాన్ని కావాలనే ఇజ్రాయిల్ అడ్డుకుంటోందని నార్వే శరణార్థుల మండలి విమర్శించింది. ప్రతి వారం గాజాకు 25 ట్రక్కుల వరకు సరఫరాలు అవసరం కాగా, కేవలం 10 లేదా 11 ట్రక్కులు మాత్రమే వస్తున్నాయని తెలిపింది. ప్రతి వారం గాజాలోకి చాలా తక్కువగా సహాయక ట్రక్కులు ప్రవేశించేలా చూస్తూ, ప్రజలను చలిలో వుంచి, ఆకలి దప్పులతో మరణించేలా చూడడం ఇజ్రాయిల్ లక్ష్యంగా వుందని విమర్శించింది. వరుసగా సహాయ కాన్వారులపై దాడులు కొనసాగుతుండడంతో ప్రస్తుతానికి సహాయం పంపడాన్ని ఆపివేస్తున్నట్లు ఐక్యరాజ్య సమితి పాలస్తీనా శరణార్థుల సంస్థ పేర్కొంది. ఈ పరిస్థితుల్లో రాఫా సరిహద్దు క్రాసింగ్‌ను తిరిగి తెరిపించే ప్రతిపాదనపై కైరోలో ప్రత్యర్థి పాలస్తీనా గ్రూపులు ఫతా, హమాస్ చర్చిస్తున్నాయి. మరోవైపు ఉత్తరాన జాబాలియా శరణార్థ శిబిరంపై, దక్షిణాన అబసన్ అల్ కబీరా శిబిరంపై దాడులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం గాజాలో సగటున ప్రపంచంలోనే ఎక్కడా లేని రీతిలో బాల వికలాంగులు వున్నారని ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. ఏడాదికి పైగా కొనసాగుతున్న దాడుల కారణంగా గాజాలో లక్షల సంఖ్యలో చిన్నారులు అవయవాలు కోల్పోయి జీవచ్ఛవంగా బతుకీడుస్తున్నారని పేర్కొంది. చాలామందికి అనస్తీషియా లేకుండానే సర్జరీలు చేయాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయని, చిన్నారుల బాధలు వర్ణనాతీతమని యుఎన్ చీఫ్ గుటెరస్ వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలను కైరో కాన్ఫరెన్స్‌లో ఆయన డిప్యూటీ చదివి వినిపించారు.

# అదానిపై ప్రధాని మౌనం వీడాలి



న్యూఢిల్లీ: అదాని ముడుపుల వ్యవహారంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మౌనం వీడాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. అదాని గ్రూప్ లంచంపై చర్చించాలని, ఈ అంశంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి) వేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాల ఆందోళనతో పార్లమెంట్ ఉభయ సభలు సోమవారం కూడా దద్దరిల్లాయి. ప్రభుత్వం చర్చకు ముందుకు రాకపోవడంతో%ఔ% నిమిషాల్లోనే లోక్‌సభ, రాజ్యసభ మంగళవారానికి వాయిదా పడ్డాయి. లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలు నిర్వహించేందుకు ప్రయత్నించారు. వెంటనే ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టారు. అదాని అంశంపై ప్రధాని స్పందించాలంటూ నినాదాలు చేశారు. ప్రతిపక్షాల ఆందోళన నడుమ ప్రశ్న అడిగేందుకు అనంతపురం ఎంపి అంబికా జి లక్ష్మినారాయణను స్పీకర్ ఓం బిర్లా పిలిచారు. ఆయన ప్రశ్నకు కేంద్ర స్కిల్‌శాఖ మంత్రి జయంతి చౌదరి సమాధానం చెప్పారు. వెంటనే లక్ష్మినారాయణ అనుబంధ ప్రశ్న అడిగారు. దానికి సమాధానం చెప్పిన తరువాత, సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలోనూ ప్రతిపక్షాలు ఆందోళన కొనసాగించాయి. ప్రతిపక్షాల ఆందోళనల మధ్యే కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ కోస్టల్ షిప్పింగ్ బిల్లును ప్రవేశపెట్టారు.

అనంతరం సభను వాయిదా వేశారు. మరోవైపు రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ ప్రారంభిస్తూ ప్రతిపక్ష సభ్యులు ఇచ్చిన 20 వాయిదా తీర్మాన నోటీసులను తిరస్కరించారు. అనంతరం సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేసిన ఆయన, తిరిగి ప్రారంభమైన సభను రెండు నిమిషాల్లోనే మంగళవారానికి వాయిదా వేశారు. నాలుగు రోజుల్లో కేవలం 54 నిమిషాలు లోక్‌సభ, 75 నిమిషాలు రాజ్యసభ కార్యకలాపాలు జరిగాయి. శీతాకాల సమావేశాలు ప్రారంభమైన వారంలో%ఔ% అతి తక్కువ పనిగా నమోదైంది. గత సోమవారం కేవలం ఆరు నిమిషాల పాటే లోక్‌సభ కార్యకలాపాలు జరగ్గా, బుధ, గురువారాల్లో రోజుకు 14 నిమిషాలు, శుక్రవారం 20 నిమిషాలు మాత్రమే జరిగాయి. రాజ్యసభలో గత సోమవారం 33 నిమిషాలు కార్యకలాపాలు జరగ్గా, బుధవారం 13 నిమిషాలు, గురువారం 16 నిమిషాలు, శుక్రవారం 13 నిమిషాలే నమోదయ్యాయి.

# తీవ్ర ఆందోళనకర అంశం

అగర్తలాలోని బంగ్లాదేశ్ అసిస్టెంట్ హై కమిషన్ కార్యాలయంలో భద్రతా నిబంధనలను ఉల్లంఘించి ఆందోళనకారులు ప్రవేశించడాన్ని 'తీవ్ర ఆందోళన కలిగించే సంఘటన' గా విదేశాంగ శాఖ సోమవారం వ్యాఖ్యానించింది. ఎలాంటి పరిస్థితుల్లోనూ దౌత్య, కాన్సులర్ కార్యాలయాలు దాడులకు లక్ష్యంగా కాకూడదని పేర్కొంది. దౌత్య కార్యాలయాల పవిత్రతను పరిరక్షించడానికి భారత్ కట్టుబడి వుందని విదేశాంగ శాఖ పునరుద్ఘాటించింది. ఈ పరిస్థితుల్లో భారత్‌లోని బంగ్లాదేశ్ దౌత్య కార్యాలయాలకు భద్రతను పెంచుతామని హామీ ఇచ్చింది. ఈ మేరకు విదేశాంగ శాఖ ఒక ప్రకటన జారీ చేసింది. గత నెల 25న ఇస్కాన్ నేత చిన్మరు దాస్‌ను అరెస్టు చేయడంపై హిందూసంఘర్ష్ సమితికి చెందిన ఆందోళనకారులు సోమవారం అగర్తలాలో అసిస్టెంట్ హై కమిషన్ కార్యాలయంలోకి బలవంతంగా చొరబడ్డారు. బంగ్లాదేశ్ జాతీయ పతాకాన్ని లాగివేసి, అక్కడున్న దౌత్య కార్యాలయ బోర్డును ధ్వంసం చేశారు. కొంతమంది నేతలు అసిస్టెంట్ హై కమిషనర్‌కు మెమొరాండం అందచేశారు. ఈలోగా భద్రతా సిబ్బంది వచ్చి బయటకు పంపివేశారు.

# తుఫాను బాధితులను ఆదుకుంటాం



న్యూఢిల్లీ : ఫెంగల్ తుఫాను తమిళనాడుని అతలాకుతలం చేసింది. ఈ తుఫాను వల్ల 14 జిల్లాల్లో 1.5 కోట్ల మంది ప్రజలపై ప్రభావం చూపిందని, 2.11 లక్షల హెక్టార్లలో పంట నష్టం జరిగిందని, మౌలిక వసతులు పూర్తిగా దెబ్బతిన్నాయని వీటి పునరుద్ధరణకు పునరావాసాల పనుల కోసం నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎన్‌డిఆర్‌ఎఫ్) నుండి రెండు వేల కోట్ల రూపాయలను విడుదల చేయాలని ప్రధాని నరేంద్ర మోడీని తమిళనాడు సిఎం స్టాలిన్ కోరారు. ఆయన మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. ఈ తుఫాను వల్ల జరిగిన నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయడానికి కేంద్ర బృందాన్ని నియమించాలని స్టాలిన్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం తమిళనాడు సిఎం ఎం.కె స్టాలిన్‌కు ఫోన్ చేశారు. ఫెంగల్ తుఫాను వల్ల నష్టపోయిన తమిళనాడుకు అన్నివిధాలా సాయం అందిస్తామని మోడీ స్టాలిన్‌కు హామీ ఇచ్చారు. కాగా, భారీ వర్షాల కారణంగా తమిళనాడులోని నీలగిరి జిల్లాలోని అన్ని పాఠశాలలను మూసివేస్తున్నట్లు ఆ జిల్లా మెజిస్ట్రేట్ లక్ష్మీ భవ్య మంగళవారం తెలిపారు.

# రెండు కేసుల్లో కుమారుడికి బైడెన్ క్షమాభిక్ష



వాషింగ్టన్ : పలు కేసుల్లో చిక్కుకున్న తన కుమారుడు హంటర్ బైడెన్‌కు అధ్యక్షుడు జో బైడెన్ సోమవారం క్షమాభిక్ష ప్రకటించారు. తాను అధ్యక్షుడిగా వున్నా న్యాయ వ్యవస్థ వ్యవహారాల్లో జోక్యం చేసుకోబోనని ప్రకటించిన బైడెన్, కుమారుడిపై కేసులు విచారణ, శిక్ష విధింపు సమయాల్లో మౌనంగా వున్నారు. తాజాగా ఆయన తన హామీని ఉల్లంఘించారు. మరికొన్ని వారాల్లో పదవి నుండి వైదొలగనున్న నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నారు. ఒక తండ్రిగా, అధ్యక్షుడిగా తాను ఈ చర్య ఎందుకు తీసుకున్నానో ప్రజలు అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన జారీ చేశారు. న్యాయ వ్యవస్థలో తనకు విశ్వాసం వుందని, అయితే మురికి రాజకీయాలు ఆ ప్రక్రియను దెబ్బ తీశాయని, అందువల్ల న్యాయం జరగలేదని వ్యాఖ్యానించారు. తన రాజకీయ ప్రత్యర్థులు దురుద్దేశపూరితంగా ఈ అభియోగాలు మోపారని, తనను దెబ్బ తీయాలన్నది వారి లక్ష్యంగా వుందని పేర్కొన్నారు. అక్రమంగా ఆయుధాలు కలిగివుండడం, పన్నులను ఎగవేయడం వంటి కేసుల్లో జూనియర్ బైడెన్‌పై డెల్వార్, కాలిఫోర్నియాల్లో అభియోగాలు నమోదయ్యాయి.



# గినియా ఫుట్‌బాల్ మ్యాచ్‌లో ఘర్షణలు

గినియా : దక్షిణ గినియాలోనే అతిపెద్ద నగరమైన నజెరెకొరెలో సాకర్ మ్యాచ్ సందర్భంగా జరిగిన ఘర్షణలు, తొక్కిసలాటలో పిల్లలతో సహా డజన్ల సంఖ్యలో అభిమానులు మరణించారు. మ్యాచ్ చూసేందుకు వచ్చిన అభిమానులతో స్టేడియం కిక్కిరిసిపోయింది. ఆ సమయంలో చెలరేగిన ఘర్షణలను అదుపు చేసేందుకు భద్రతా బలగాలు ప్రయత్నించాయి. దాంతో చోటుచేసుకున్న తొక్కిసలాటలో భారీగా ప్రాణ నష్టం సంభవించిందని స్థానిక మీడియా, రాజకీయ పార్టీల కూటమి వెల్లడించింది. స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం మధ్యాహ్నం (డిసెంబరు 2వ తేదీ) ఈ తొక్కిసలాట జరిగిందని గినియా ప్రధాని అమదవు ఒరి బా%ఎ% ఎక్స్‌లో తెలిపారు. ఎంతమంది మరణించారనే సంఖ్యను నిర్దిష్టంగా వెల్లడించలేదు. అధికారులు ఆ ప్రాంతంలో శాంతి భద్రతలను పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తున్నారని బా%ఎ% తెలిపారు. డజన్ల సంఖ్యలో మరణాలు సంభవించాయని, పదుల సంఖ్యలో గాయపడ్డారని రాజకీయ పార్టీల కూటమి నేషనల్ అలయన్స్ ఫర్ ఆల్టర్‌నేషన్ అండ్ డెమోక్రసీ ఒక ప్రకటనలో తెలిపింది. స్థానిక మీడియా కథనం ప్రకారం సాకర్ మ్యాచ్‌లో వివాదాస్పద పెనాల్టీ విషయం అభిమానులకు ఆగ్రహం తెప్పించింది. కొందరు రాళ్లు విసిరారు. దీంతో, భద్రతా బలగాలు బాష్పవాయు గోళాలను ప్రయోగించాయి. ఈ ఘటనలో పిల్లలుసహా చాలామంది చనిపోయారు. సమీపంలోని ఆస్పత్రిలో గాయపడిన వారు చికిత్స పొందుతున్నారని, వారిలో కొంతమంది పరిస్థితి విషమంగా వుందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

# అదానీ అవినీతిపై జ్యుడీషియల్ విచారణ చేపట్టాలి

న్యూఢిల్లీ : అదాని సంస్థలపై జ్యుడీషియల్ విచారణ చేపట్టాలని భారత ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఇఎఎస్.శర్మ, ఢిల్లీ జేఎన్‌యూ రిటైర్డ్ ప్రొఫెసర్ అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "విద్యుత్ విధానాలు– అదానీ అవినీతి" అనే అంశంపై జరిగిన వెబినార్‌లో వారు ముఖ్యవక్తలుగా పాల్గొని ప్రసంగించారు. కేద్రంలోని మోడీ సర్కార్‌ను అండతో కాంట్రాక్టులు సాధించేందుకు అదాని సంస్థలు అక్రమ మార్గాల్లో నిధులు సేకరించి, దేశంలోని బ్యూరోకాట్లు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లంచాలిస్తున్నారని ఆరోపించారు. అమెరికా గ్రాండ్ జ్యూరి విచారణతో ఈ స్కాం బయట పడిందని గుర్తు చేశారు. అమెరికాలోని సెక్యూరిటీ సంస్థకు తప్పుడు సమాచారం ఇచ్చి అక్రమంగా నిధులు సమీకరించడం, వాటిని కప్పిపుచ్చేందుకు సాక్ష్యాలను తారుమారు చేయడం, న్యాయవ్యవస్థకు ఆటంకం కల్గించడం లాంటి ఐదు రకాల నేరాలకు పాల్పడినట్టు కేసు నమోదైందని పేర్కొన్నారు. అదానీ అవినీతి, అక్రమాలపై అమెరికాలో విచారణ జరుగుతున్నా కేంద్రంలోని మోడీ సర్కార్ చర్యలు తీసుకోకపోగా వారికే మద్దతిస్తోందని ఆరోపించారు. దేశంలోని కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకు సోలార్ విద్యుత్ విధానాన్ని మోడీ సర్కార్ తీసుకొచ్చిందని విమర్శించారు. గుజరాత్‌లోని అదాని సౌరవిద్యుత్ గ్రిడ్‌లో ఉత్పత్తి చేసే విద్యుత్‌ను నేరుగా అమ్మితే కొనరనీ, 'సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా'(ఎస్ఈసీఐ)ను కేంద్రం స్థాపించిందని ఆరోపించారు.

కార్పొరేట్ సంస్థలు ఉత్పత్తి చేసే సోలార్ విద్యుత్‌ను ఎస్ఈసీఐకి సరఫరా చేస్తే, అక్కడి నుంచి దేశంలోని రాష్ట్రాలు తమకు కావాల్సిన విద్యుత్‌ను కొనుగోలు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మార్కెట్ ధరలతో పోల్చితే ఈ విద్యుత్ ఖరీదు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రాష్ట్రాలు ముందుకు రాలేదని అన్నారు. ఈ క్రమంలో అదానీ సంస్థలు బ్యూరోకాట్లు, సీఎంలకు తాయిలాలిచ్చి 25 ఏండ్ల దీర్ఘకాలిక ఒప్పందాలు చేసుకున్నాయని ఆరోపించారు. వీటికోసం నిధులు సమీకరించే సందర్భంలోనే అమెరికాలో అదానీ సంస్థ దొరికిపోయి గ్రాండ్ జ్యూరీ విచారణ ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. ఇన్ని జరుగుతున్నా దేశంలోని సెబీ, సీబీఐ లాంటి సంస్థలు మౌనంగా ఎందుకున్నాయని ప్రశ్నించారు. అదానీ అవినీతి బాగోతం బయటకు రావాలంటే జ్యుడిషియల్ విచారణతో పాటు ప్రజల్లో విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ఎస్‌వీకే మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయకుమార్ సమన్వయకర్తగా వ్యవహరించిన వెబినార్‌లో కొండూరి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న 'మహా' ప్రతిష్టంభన

ముంబయి : మరాఠా పీఠంపై కొనసాగుతున్న ప్రతిష్టంభన సోమవారం పదో రోజుకు చేరింది. బుధవారం జరిగే పార్టీ శాసనసభాపక్ష సమావేశానికి పరిశీలకులుగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజరు రూపానీని బిజెపి అధిష్టానం ముంబయి పంపుతోంది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిండే తన షెడ్యూల్ సమావేశాలను రద్దు చేసుకున్నారు. మరో కీలక నేత, ఎన్‌సిపి అధినేత అజిత్ పవార్ మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటుపై, మంత్రుల శాఖలపై బిజెపి నాయకత్వంతో చర్చలు జరిపేందుకు ఢిల్లీ వెళ్లారు. ముఖ్యమంత్రి పదవిని ఆశిస్తున్న బిజెపి సీనియర్ నేత దేవేంద్ర ఫడ్నవీస్ ఆపద్ధర్మ ముఖ్యమంత్రి షిండేకు ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ముఖ్యమంత్రి పదవికి ఫడ్నవీస్ పేరు ఖరారైందని బిజెపి సీనియర్ నేత ఒకరు పిటిఐ వార్తాసంస్థకు తెలిపారు. ముంబయిలోని ఆజాద్ మైదాన్‌లో ఈ నెల ఐదవ తేదీన ప్రభుత్వ ప్రమాణస్వీకార కార్యక్రమం ఉంటుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ బవన్‌కులే ప్రకటించారు. ఏక్‌నాథ్ షిండే గొంతు ఇన్‌ఫెక్షన్, జ్వరంతో బాధపడుతుండడంతో సోమవారం జరగాల్సిన మహాయుతి నేతల భేటీ వాయిదా పడింది. ఆయన ఇంకా సతారాలోని తన స్వగ్రామంలోనే ఉన్నారు. మహాయుతి నేతలు మంగళవారం సమావేశమై మంత్రుల శాఖల కేటాయింపుపై ఓ నిర్ణయానికి వస్తారని సమాచారం.

ఉప ముఖ్యమంత్రి పదవి కావాలని డిమాండ్ చేస్తున్నట్టు వస్తున్న వార్తలను షిండే కుమారుడు, శివసేన ఎంపీ శ్రీకాంత్ షిండే తోసిపుచ్చారు. ఈ వార్తలు నిరాధారమని అంటూ మంత్రి పదవికి తాను పోటీలో లేనని స్పష్టం చేశారు.

# ఏడు కొత్త కేసుల్లో ఇమ్రాన్ ఖాన్‌కు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్



ఇస్లామాబాద్ : పాకిస్తాన్ తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్ (పిటిఐ) పార్టీ ఇటీవల నిర్వహించిన ఆందోళనలు, నిరసనలకు సంబంధించి నమోదైన ఏడు కొత్త కేసుల్లో మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు తీవ్రవాద నిరోధక కోర్టు 14రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. మరో కేసులో ఆరు రోజులపాటు విధించిన పోలీసు రిమాండ్‌ను పూర్తి చేసిన అనంతరం ఖాన్‌ను అడియాలా జైలుకు తీసుకువచ్చి జడ్జి ముందు ప్రవేశపెట్టారు. విచారణ పూర్తి చేసిన న్యాయమూర్తి అంజాద్ అలీ షా, న్యూ టౌన్ పోలీసు స్టేషన్ కేసుతోపాటు మరో ఆరు కేసుల్లో ఖాన్ జ్యుడీషియల్ రిమాండ్‌ను ఆమోదించారు. గతేడాది పాకిస్తాన్ ఆర్మీ హెడ్‌క్వార్టర్స్‌పై దాడికి సంబంధించి ఖాన్‌ను అరెస్టు చేశారు. మిగిలిన ఆరు కేసుల్లో ఖాన్ భౌతిక రిమాండ్ కోసం పోలీసులు అభ్యర్థించినా న్యాయమూర్తి తిరస్కరించారు. ఈ కేసులన్నీ సెప్టెంబరు 28, అక్టోబరు 5 మధ్యే నమోదయ్యాయి. గత నెల్లో రెండవ తోషఖానా కేసులో ఆయనకు బెయిల్ లభించిన తర్వాత న్యూ టౌన్ పోలీసు స్టేషన్ కేసులో రావల్పిండి పోలీసులు ఖాన్‌ను అరెస్టు చేశారు. అవిశ్వాస తీర్మానంతో 2022లో ఖాన్ ప్రభుత్వం పడిపోయినప్పటి నుండి ఆయనపై డజన్ల కొద్దీ కేసులు నమోదవుతూనే వున్నాయి.

# షుగర్ పేషెంట్స్ జామ తింటే ఏమౌతుంది?



అలాంటి జామపండులో రెండు రకాలు ఉన్నాయి. తెలుపు, గులాబీ రెండు రకాలు ఉంటాయి. అయితే, డయాబెటిక్ బాధితులు పింక్ జామకాయ తింటే ఏమౌతుందో ఇక్కడ తెలుసుకుందాం. సంపూర్ణ ఆరోగ్యానికి పండ్లు మంచి పోషకాహారం అని మనందరికీ తెలుసు. పండ్లలో ముఖ్యంగా జామకాయ గురించి చెప్పుకోవాలి. జామకాయను పేదవాడి యాపిల్ అని కూడా పిలుస్తారు. జామకాయలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అందుకే దీన్ని సూపర్ ఫుడ్ అని కూడా అంటారు. జామకాయ పోషకాల పవర్ హౌస్. అలాంటి జామపండులో రెండు రకాలు ఉన్నాయి. తెలుపు, గులాబీ రెండు రకాలు ఉంటాయి. అయితే, డయాబెటిక్ బాధితులు పింక్ జామకాయ తింటే ఏమౌతుందో ఇక్కడ తెలుసుకుందాం.. పింక్ జామలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. ఇందులో చక్కెర, కార్బ్స్ , విటమిన్ సి తక్కువగా ఉంటాయి. దీనికి గింజలు కూడా తక్కువ. తెల్లజామలో చక్కెర, స్టార్చ్, విటమిన్ సి, విత్తనాలు ఎక్కువగా ఉంటాయి. తెల్ల జామలో యాంటీఆక్సిడెంట్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. పింక్ జామలో యాంటీఆక్సిడెంట్ కంటెంట్ ఇంకా ఎక్కువగా ఉంటాయి. గులాబి జాయకాయలో విటమిన్ సి, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. పింక్ జామకాయల్లో విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలం. విటమిన్ సి వల్ల రోగ నిరోధక శక్తి పెరిగి, జలుబు, ఫ్లూ వంటి వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి ఉండటం వల్ల డయాబెటిస్ ఉన్నవారికి మంచిది. పింక్ జామకాయల్లో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. పింక్ జామకాయల్లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలం, ఇవి క్యాన్సర్‌ను నివారించడంలో సహాయపడతాయి. ఫైబర్ అధికంగా ఉండటం వల్ల జీర్ణక్రియ మెరుగుపడి, మలబద్ధకం తగ్గుతుంది.

# చలికాలంలో కొబ్బరి నీళ్లు తాగితే!



కొబ్బరి నీళ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిలో పుష్కలంగా ఉండే ఎలక్ట్రోలైట్స్, హైడ్రేషన్ గుణాలు శరీరానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. అయితే కొబ్బరి నీళ్లు చలికాలంలో తాగితే ఆరోగ్య సమస్యలు కలగుతాయని కొందరు భావిస్తుంటారు. ఇందులో ఏమాత్రం నిజం లేదని పలువురు నిపుణులు చెబుతున్నారు. శీతాకాలంలో కొబ్బరినీళ్లు తాగితే ఏమౌతుందో ఇక్కడ తెలుసుకుందాం.. చలికాలంలో చాలామంది నీటిని తక్కువగా తాగుతారు. దాంతో డీహైడ్రేషన్ సమస్యలు వస్తాయి. కానీ కొబ్బరి నీరు చలికాలంలో కూడా శరీరానికి హైడ్రేషన్ అందించడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. దీని వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే చలికాలంలో వచ్చే చర్మ పగుళ్ళు, జలుబు, దగ్గు వంటి సమస్యలు కూడా దూరమవుతాయి. కొబ్బరి నీళ్లతో పలు ఆరోగ్య సమస్యలు దూరమవుతాయి. కొబ్బరి నీరు జీర్ణశక్తిని కూడా మెరుగుపరుస్తుంది. ఎసిడిటీ, కడుపు నొప్పులు, పొట్ట ఉబ్బరం వంటి సమస్యలను నివారిస్తుంది. చలికాలంలో వచ్చే రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు కూడా కొబ్బరి నీరు తాగడం ద్వారా అదుపులో ఉంటాయి. కొబ్బరి నీళ్లలో ఉండే మెగ్నీషియం, ఎంజైమ్‌లు శరీరంలోని విషపదార్థాలను బయటకు పంపి, శరీరాన్ని శుద్ధి చేస్తాయి. చాలా మంది చలికాలంలో చర్మం పొడిబారడం, కష్టపడటం వంటి సమస్యలు ఎదుర్కొంటారు. కానీ కొబ్బరి నీరు చర్మాన్ని పుష్కలంగా హైడ్రేట్ చేసి, ఈ సమస్య నుండి బయటపడేందుకు సాయపడుతుంది. చలికాలంలో కొబ్బరి నీరు తాగడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దీంతో తరచుగా వచ్చే జలుబు, దగ్గు వంటి సమస్యలు దూరమవుతాయి. పౌష్టికాహార నిపుణులు కూడా చలికాలంలో కొబ్బరి నీరు తాగడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందని సూచిస్తున్నారు. చలికాలంలో వచ్చే జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేయడంలో కూడా కొబ్బరి నీరు ఉపయోగడుతుంది. ముఖ్యంగా ఎసిడిటీతో వచ్చే పొట్ట ఉబ్బరం, కడుపు నొప్పి వటి సమస్యలన్నీ దూరమవుతాయి. ఇందులో ఉండే మెగ్నీషియం కంటెంట్ రక్తపోటును అదుపులో ఉంచుతుంది. దీంతో గుండె ఆరోగ్యం మెరుగవుతుంది.

# అటిక మామిడి తీగ గురించి తెల్సా!



ప్రకృతి సిద్ధంగా మన పరిసరాల్లో సమృద్ధిగా పెరిగి, లభించే ఔషధ గుణాలు కలిగిన మొక్కలను, వనమూలికలను ఉపయోగించి ప్రమాదకరమైన మొండి వ్యాధులను సైతం మన పూర్వికులు తరిమి కొట్టేవారు. ఇప్పుడు అలంటి ఓ మొక్క గురించి మీకు తెలియజేయబోతున్నాం. మన చుట్టుపక్కల పరిసరాల్లోని పెరిగే మొక్కల్లో ఎన్నో ఔషద గుణాలు దాగి ఉన్నాయి. తరాలు మారిపోవడంతో.. మనకే వాటి గురించి తెలియక పిచ్చి మొక్కలు అనుకుంటూ పీకి పారేస్తున్నాం. కొన్ని మొక్కలు అయితే లక్షల రూపాయలు ఖర్చుచేసినా నయంకాని వ్యాధులను తరిమికొట్టేస్తాయి. మన పూర్వీకులు.. ఆయుర్వేద పద్ధతుల ఫాలో అయ్యి.. రూపాయి ఖర్చు లేకుండా ఎన్నో ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ పొందేవారు. అందుకే అప్పట్లో పెరట్లో ఎన్నో ఔసధ గుణాలను ఉన్న మొక్కల్ని పెంచేవారు. అందులో ఒకటి అటిక మామిడి తీగ. పల్లెల్లో విరివిగా కనిపిస్తుంది.. దీనిని అంటుడు కాయ మొక్క అని కూడా కొన్ని ప్రాంతాల్లో పిలుస్తారు. కిడ్నీ సమస్యలన్నిటికీ ఇది మంచి సొల్యూషన్ అంటుంటారు. కిడ్నీలో రాళ్లు ఏర్పడినా, ఇతరత్రా వ్యాధులు వచ్చినా, వచ్చే అవకాశాలున్నా దీన్ని వాడితే.. మీ కిడ్నీల సమస్యలన్నీ మటుమాయం అయిపోతాయట. కిడ్నీలు డయాలసిస్ వరకు వచ్చిన వారి ప్రాణాలను సైతం అటిక మామిడి కాపాడిందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అటిక మామిడి తీగను తెంచుకుని ఆకులు, పువ్వులు, రెమ్మలు, వేర్లతో సహా సన్నని ముక్కలుగా చేసుకోవాలి. 200 మి.లీ. నీటిని ఓ గిన్నెలో తీసుకుని సన్నని సెగపై 5-10 నిమిషాలు మరిగించాలి. మరిగే క్రమంలోనే అందులో ఆ ముక్కలను వేయలి. తర్వాత ఆకుల్లోని సారం దిగి రసంగా మారిన తర్వాత వడకట్టి రసం వరకు ఓ గ్లాసులోకి తీసుకోవాలి. రోజూ ఉదయం 50మి.లీ. నీటిని తాగితే సరిపోతుంది. అటిక మామిడి తీగ ఊళ్లలో, చేలల్లో ఎక్కడపడితే అక్కడ పెరుగుతుంది. కిడ్నీ వ్యాధులకు సంబంధించిన ఇంగ్లిష్ మందుల్లో దీనిని ఎక్కువగా వాడతారని తెలిసింది. దీనిని మిగిలిన ఆకు కూరల్లాగానే వండుకుని తినవచ్చట. కళ్ల నుంచి కాళ్ల వరకు, శిరస్సు నుంచి పాదాల వరకు అన్ని అవయవాలకు చక్కటి పోషకాలు ఇస్తుందని ఆయుర్వేదం చెబుతోంది. ఇది తాగడం వల్ల వారానికి 3సార్లు చేసే డయాలసిస్ క్రమంగా ఒక్కసారికి వచ్చి తర్వాత అవసరమే ఉండదన్నది ఆయుర్వేద నిపుణులు చెబుతున్న మాట


# వేడి నీళ్లతో స్నానం చేస్తున్నారా..?



చలికాలంలో చాలా మంది వేడి నీటితో స్నానం చేస్తారు.. చలి నుంచి ఉపశమనం పొందేందుకు ఇలా చేస్తుంటారు.. అయితే.. వేడి నీటితో స్నానం చేయడం వల్ల ఉల్లాసంగా అనిపిస్తుంది.. శారీరకంగా ఓదార్పునిస్తుంది. ఈ క్రమంలో మీరు, బీపీ లేదా హార్ట్ పేషెంట్ అయితే కొన్ని విషయాలను గుర్తుంచుకోవాలి.. లేకపోతే ప్రమాదంలో పడే అవకాశం ఉంది. చలి విజృంభిస్తోంది.. ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. అయితే, శీతాకాలంలో స్నానం చేయడానికి వేడి నీటిని ఉపయోగించడం చాలా సౌకర్యవంతమైన ఎంపిక.. ఈ అలవాటు శారీరక సౌఖ్యాన్ని అందించడమే కాకుండా మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది. అయితే, వేడి నీళ్లతో స్నానం చేయడం వల్ల ప్రయోజనాలతో పాటు కొన్ని నష్టాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా హృద్రోగులకు స్నానం చేసే నీటి ఉష్ణోగ్రత సరిగ్గా ఉండటం చాలా ముఖ్యం. అటువంటి పరిస్థితిలో, చలికాలంలో ఆరోగ్యంగా ఉండేందుకు ఏ రకమైన నీటితో స్నానం చేయడం ఆరోగ్యానికి ప్రయోజనకరం.. ఎలాంటి తప్పులు చేయకూడదు.. అనే విషయాలను తెలుసుకోవడం చాలామంచిది. కొన్ని అనారోగ్య సమస్యలున్న వారు వేడినీటితో స్నానం చేయడం వల్ల గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదం పెరిగే అవకాశం ఉందంటున్నారు వైద్య నిపుణులు.. ఇలాంటి పరిస్థితుల్లో వేడి నీటితో స్నానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు, దుష్ప్రభావాలు ఏంటో తెలుసుకోండి.. వేడి నీటితో స్నానం చేయడం వల్ల శారీరక, మానసిక ఒత్తిడి తగ్గుతుంది. వేడి నీటితో స్నానం చేయడం వల్ల కండరాల ఒత్తిడి తగ్గుతుంది. ఇది శారీరక ఉపశమనాన్ని అందిస్తుంది.

ఇది కాకుండా, ఇది శరీర రక్త ప్రసరణను కూడా పెంచుతుంది. దీని కారణంగా ఆక్సిజన్, పోషకాలు అన్ని శరీర భాగాలకు సరిగ్గా చేరుతాయి. వేడి నీరు చర్మ రంధ్రాలను తెరుస్తుంది.. మురికిని బయటకు తీస్తుంది.. తద్వారా చర్మాన్ని శుభ్రపరుస్తుంది. వేడి నీటితో స్నానం చేయడం వల్ల శరీరం మొత్తం ఉపశమనం పొందుతుంది.. ఇది దృఢత్వం, నొప్పి నుంచి ఉపశమనాన్ని అందిస్తుంది. వేడి నీరు చర్మం సహజ తేమను తొలగిస్తుంది. దీని వలన చర్మం పొడిబారుతుంది. చికాకు, దురద లేదా పగుళ్లు ఏర్పడవచ్చు. వేడి నీళ్లతో స్నానం చేయడం వల్ల శరీర ఉష్ణోగ్రత పెరిగి, బీపీ పెరుగుతుంది. ముఖ్యంగా ఇప్పటికే బిపి లేదా గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారికి ఇది ప్రాణాంతకం.. కొందరికి బాగా వేడి నీళ్లతో స్నానం చేసిన తర్వాత తల తిరగడం కూడా అనిపించవచ్చు.. ఎందుకంటే శరీరం బలహీనంగా, అలసటగా అనిపిస్తుంది. తలనొప్పి, డీహైడ్రేషన్, వికారం, మూర్ఛపోవడం లాంటి సమస్యలను కూడా ఎదుర్కొవాల్సి ఉంటుంది. శీతాకాలంలో స్నానం చేయడానికి నీటి ఉష్ణోగ్రత చాలా చల్లగా లేదా చాలా వేడిగా ఉండకూడదు. గోరువెచ్చని నీరు ఉత్తమ ఎంపిక.. ఇది సౌకర్యవంతంగా ఉండటమే కాకుండా చర్మం, బిపిపై మంచి ప్రభావాన్ని చూపుతుంది. మీరు వేడి నీటితో స్నానం చేస్తుంటే, స్నానం చేసిన తర్వాత మాయిశ్చరైజర్‌ను సరిగ్గా అప్లై చేయడం కూడా ముఖ్యం.. తద్వారా చర్మం తేమగా ఉంటుంది.

# చలికాలంలో రాత్రిపూట చెమట పట్టుతుందా..?



చలికాలపు రాత్రులలో, అందరూ మెత్తని బొంత వెచ్చదనాన్ని ఆస్వాదిస్తుంటారు.. కానీ.. కొంతమంది చెమటతో తడిసి ముద్దవుతుంటారు.. వారికి నిద్ర కూడా సరిగా ఉండదు.. వేసవిలో అయితే సాధారణం కానీ.. చలికాలంలో ఇలా పదే పదే జరుగుతుంటే తేలిగ్గా తీసుకోవడం సరికాదంటున్నారు వైద్య నిపుణులు. చలికాలం ప్రారంభమైంది.. ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి.. దీంతో అందరూ తీవ్రమైన చలికి వణికిపోతున్నారు.. వాస్తవానికి, చలికాలపు రాత్రులలో అందరూ మెత్తని బొంత, రగ్గులు కప్పుకుని వెచ్చదనాన్ని ఆస్వాదిస్తుంటారు.. అయితే.. కొందరు చెమటతో తడిసి మేల్కొంటారు. ఎంత చల్లగా ఉన్నా రాత్రిపూట చెమట ఎక్కువగా పడుతుంది.. ఇలా పదే పదే జరుగుతుంటే తేలిగ్గా తీసుకోవడం సరికాదంటున్నారు వైద్య నిపుణులు.. చల్లని వాతావరణంలో రాత్రిపూట చెమటలు పట్టడం అనేది కొన్ని తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు సంకేతమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చలిలో కూడా రాత్రి చెమటలు పట్టడం వెనుక అనేక కారణాలు ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. అత్యంత సాధారణ కారణాలు హార్మోన్ల అసమతుల్యత, ఇన్ఫెక్షన్ లేదా చాలా వెచ్చని బట్టలు ధరించడం.. కానీ ఈ సమస్య నిరంతరం కొనసాగితే, ఇది కొన్ని తీవ్రమైన వ్యాధుల లక్షణం కావచ్చు. అవేంటో తెలుసుకోండి. (క్షయవ్యాధి): ప్రారంభ లక్షణాలు రాత్రిపూట చెమటలు పట్టడం. ఈ ఇన్ఫెక్షన్ ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తుంది. సమయానికి చికిత్స చేయకపోతే ప్రమాదకరంగా మారుతుంది. హాడ్జికిన్స్ లింఫోమా క్యాన్సర్: అనేది శోషరస కణుపులను ప్రభావితం చేసే ఒక రకమైన క్యాన్సర్. దీని లక్షణాలు రాత్రి చెమటలు, బరువు తగ్గడం, జ్వరం లాంటివి కనిపిస్తాయి. హైపర్ థైరాయిడిజం: థైరాయిడ్ గ్రంధి అతిగా పనిచేసినప్పుడు కూడా రాత్రిపూట చెమటలు పట్టవచ్చు. ఈ పరిస్థితి హృదయ స్పందన రేటును పెంచుతుంది. శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడంలో సమస్యలను కలిగిస్తుంది. మెనోపాజ్ లేదా హార్మోన్ల మార్పులు: మహిళల్లో రుతువిరతి సమయంలో హార్మోన్ల మార్పులు చలిలో కూడా చెమటలు పట్టేలా చేస్తాయి. గుండె సంబంధిత సమస్యలు: రాత్రిపూట చెమటలు పట్టడం గుండెపోటు వంటి గుండె సమస్యలకు సంకేతం.. ఇలా తరచూ కొనసాగుతుంటే.. దీనిని నిర్లక్ష్యం చేయకూడదు.

# శీతాకాలంలో శరీరాన్ని వెచ్చగా ఉంచడానికి ఆల్కహాల్ సేవిస్తున్నారా?



శీతాకాలంలో చలి నుంచి తప్పించుకోవడానికి చాలా మంది ఆల్కహాల్ సేవిస్తుంటారు. ఇది తాగితే క్షణాల్లోనే శరీరం వెచ్చగా మారి హాయిగా ఉంటుంది. అయితే ఈ అలవాటు మునుముందు ఎలాంటి ప్రమాదాలు తెచ్చిపెడితుందో ఇక్కడ తెలుసుకోండి.. చలికాలం ప్రారంభమైంది. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పడిపోతున్నాయి. అంతేకాకుండా ఫ్లూతో సహా అనేక వ్యాధులు విజృంభిస్తున్నాయి. సీజనల్‌గా వచ్చే ఫ్లూతోపాటు అనేక వ్యాధులు ప్రబలుతుండడంతో ఆసుపత్రుల్లో రోగుల తాకిడి కూడా పెరుగుతోంది. కాబట్టి ఈ కాలంలో వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే ఈ జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి. చలి వాతావరణం అనేక అనారోగ్య సమస్యలకు దారి తీస్తుంది. కాబట్టి అదనపు జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. కానీ కొందరు ఈ కాలంలో జలుబు, దగ్గు వంటి వాటి నుంచి రక్షించుకోవడానికి ఆల్కహాల్ తీసుకోవడం మొదలుపెడతారు. ఇది ఎంత ప్రమాదకరమో తెలిస్తే జన్మలో ముట్టుకోరని అంటున్నారు వైద్యులు. నిజానికి, ఈ కాలంలో మద్యం తాగడం వల్ల జలుబు నుంచి ఉపశమనం పొందవచ్చనే అపోహ చాలా మందిలో ఉంటుంది. కానీ శీతాకాలంలో మద్యం సేవించడం వల్ల వచ్చే సమస్యలు అన్నీ ఇన్నీకావు. సాధారణంగా సాయంత్రం వేళల్లో చలి మొదలవుతుంది. చలి నుంచి ఉపశమనం పొందడానికి చాలా మందికి మద్యం సేవించే అలవాటు ఉంటుంది. అందులోనూ చలి నుంచి తప్పించుకోవడానికి మరికాస్త ఎక్కువగా తాగుతారు. ఈ అలవాటు అనేక సమస్యలను ఆహ్వానిస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది శ్వాసకోశ సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. తీవ్రమైన జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, చర్మం నీలంగా మారడం, పెదవుల నుండి రక్తం, కఫం సమస్యలు ఉంటే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలని డాక్టర్ సూచిస్తున్నారు. ఉష్ణోగ్రత తగ్గినప్పుడు వెచ్చగా ఉండటానికి మద్యం తాగడం వల్ల ఈ సమస్యలు తలెత్తుతాయని వైద్యులు చెబుతున్నారు. ఈ కాలంలో మద్యం సేవించడం వల్ల మొదట వెచ్చని అనుభూతిని కలిగిస్తుంది. కానీ క్రమంలో ఆల్కహాల్ మీ హృదయ స్పందన రేటు పెంచుతుంది. ఇది అరిథ్మియా ప్రమాదాన్ని పెంచుతుంది. విపరీతమైన చలిలో మద్యం సేవించడానికి బదులు మందపాటి బట్టలు ధరించడం, పోషకాహారం తీసుకోవడం, వీలైనంత వరకు వెచ్చని పానీయాలు తాగడం అలవాటు చేసుకోవాలి.




# గ్రాండ్‌గా ఫిలింఫేర్ షార్ట్ ఫిలిం వేడుకలు

2024 ఫిల్మ్‌ఫేర్ ఓటీటీ అవార్డుల వేడుక ఆదివారం రాత్రి ముంబయిలో వైభవంగా జరిగింది. అయితే ఈ వేడుకలలో సాయిదుర్గ తేజ్, స్వాతి రెడ్డి కాంబోలో వచ్చిన ''సత్య'' షార్ట్ ఫిలిం పీపుల్స్ ఛాయిస్ అవార్డును గెలుచుకుంది. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీకి చెందిన సినీ ప్రముఖులు హాజరయ్యారు. వివిధ కారణాల వలన నేరుగా ఓటీటీలో విడుదలైన సినిమాలు, వెబ్ సిరీస్‌లలో అద్భుత నటన ప్రదర్శించిన నటీనటులు, టెక్నిషియన్స్ కు ఈ అవార్డులను ప్రకటించారు. సినిమా విభాగంలో ఉత్తమ నటిగా బాలీవుడ్ భామ కరీనా కపూర్, ఉత్తమ నటుడిగా దిల్జిత్ దొసాంజ్ అవార్డు గెలుచుకోగా, ఉత్తమ సిరీస్ గా రైల్వేమెన్ అవార్డు గెలుచుకుంది. ఈ వేడుకలోనే టాలీవుడ్ నటుడు సాయిదుర్గా తేజ్, స్వాతి నటించిన షార్ట్ ఫిల్మ్ 'సత్య' అవార్డు గెలుచుకుంది. హార్ట్ టచింగ్ షార్ట్ ఫిలింగా అందరి ప్రశంసలు పొందింది సుప్రీమ్ హీరో సాయిదుర్గ తేజ్ నటించిన ''సత్య''. ఈ షార్ట్ ఫిలిం ఫిలింఫేర్ షార్ట్ ఫిలిం అవార్డ్స్ 2024లో పీపుల్స్ ఛాయిస్ కేటగిరిలో అవార్డు గెల్చుకుంది. ఈ అవార్డు గెల్చుకున్న హ్యాపీ మూవ్ మెంట్ ను టీమ్ సోషల్ మీడియా ద్వారా షేర్ చేస్తూ ' సత్య ప్రజల కోసం రూపొందించబడిన ఒక అందమైన కథ, ఫిలింఫేర్ పీపుల్స్ ఛాయిస్ బెస్ట్ షార్ట్ ఫిల్మ్ 2024 అవార్డుతో ప్రజలతో రివార్డ్ చేయబడింది. నలుగురు స్నేహితులు కలిసి మొదలు పెట్టిన ఈ ప్రయాణం జీవితాంతం నిలిచిపోయే జ్ఞాపకాలను అందించింది, అందరికి ధన్యవాదాలు' అని సాయి ట్వీట్ చేశారు. ''సత్య'' షార్ట్ ఫిలింలో స్వాతి రెడ్డి హీరోయిన్ గా నటించింది. హర్షిత్, హన్షిత నిర్మాతలుగా వ్యవహరించారు. విజయకృష్ణ వీకే దర్శకత్వం వహించారు. మ్యూజికల్ షార్ట్ ఫిలింగా ''సత్య'' ప్రేక్షకులకు మంచి అనుభూతిని ఇచ్చింది.

# విరహ వేదనలో సారంగపాణి

మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మించిన సినిమా 'సారంగపాణి జాతకం'. ప్రియదర్శి, రూప కొడువాయూర్ జంటగా నటించారు. 'జెంటిల్‌మన్', 'సమ్మోహనం' విజయాల తర్వాత మోహనకృష్ణ ఇంద్రగంటి, శివలెంక కృష్ణప్రసాద్ కలయికలో రూపొందుతున్న మూడో చిత్రమిది. ఈనెల 20న థియేటర్లలోకి వస్తుందీ సినిమా. టైటిల్ సాంగ్ 'సారంగో సారంగో' కొన్ని రోజుల క్రితం విడుదలైంది. రెండో పాట 'సంచారి సంచారి'ని సోమవారం విడుదల చేశారు. దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి మాట్లాడుతూ, 'ఎటువంటి కథలోనైనా భావోద్వేగం లేకపోతే ఆ కథకు పరిపూర్ణత ఉండదు, 'సారంగపాణి జాతకం' లాంటి పూర్తి నిడివి హాస్యరస చిత్రంలో కూడా! ముఖ్యంగా ఈ సినిమాలో ప్రధానమైన అంశం ప్రేమ. తాను ప్రాణంగా ప్రేమించిన అమ్మాయికి, తన నమ్మకానికి మధ్య నలిగిపోయిన వ్యక్తి కథే ఈ సినిమా. 'సంచారి' అనే పాట తన నమ్మకం వల్ల తాను ప్రాణంగా ప్రేమించే అమ్మాయిని కోల్పోయే సందర్భంలో వస్తుంది. కొంత విరహ వేదన, కొంత ఆ అమ్మాయిని కోల్పోతాననే తపన - వేదన మేళవించిన గీతమిది. ద్వితీయార్థంలో కీలకమైన సందర్భంలో వచ్చిన తర్వాత కథ గమనాన్ని మారుస్తుంది. అమ్మాయిని పొందాలనే అతని కోరికను బలంగా మార్చి, ఆఖరి ఆటంకాన్ని ఎదుర్కోవడానికి ప్రేరేపిస్తుంది. ఈ పాటకు కథలో మంచి ప్రాముఖ్యం ఉంటుంది. నాకు చాలా చాలా ఇష్టమైన పాటల్లో ఇదొకటి. సంజీత్ హెగ్డే అద్భుతంగా పాడిన పాట. రామజోగయ్య శాస్త్రి ఎంత బాగా రాస్తారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సంగీత దర్శకుడు వివేక్ సాగర్ శైలి గుర్తొచ్చే పాట ఇది. ప్రియదర్శి, రూప నటన కూడా బావుంటుంది. నాకు ఇష్టమైన పాట ప్రేక్షకులకు కూడా దగ్గర అవుతుందని నమ్ముతున్నాను' అని అన్నారు.



# గిరిజన వేషధారణలో విష్ణు మంచు పిల్లలు



డైనమిక్ హీరో విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ అయిన 'కన్నప్ప' చిత్రం నుంచి వస్తున్న ప్రతీ అప్డేట్ ప్రేక్షకుల్లో అంచనాలు పెంచేస్తూనే ఉన్నాయి. భారీ క్రేజీ పాన్- ఇండియా ప్రాజెక్ట్ అయిన 'కన్నప్ప' ఏప్రిల్ 25, 2025న విడుదల కానుంది.

ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సంబంధించిన మరో అప్డేట్‌ను సోమవారం నాడు రిలీజ్ చేశారు. విష్ణు మంచు పిల్లలు అరియానా మంచు, వివియానా మంచు ఫస్ట్ లుక్‌లను విడుదల చేశారు. అంతే కాకుండా సోమవారం విష్ణు మంచు కవల కుమార్తెల పుట్టినరోజులు కావడం కూడా విశేషం. ఈ పోస్టర్‌లో పిల్లలిద్దరూ గిరిజన వేషధారణలో చాలా డిఫరెంట్‌గా కనిపిస్తున్నారు. శ్రీ కాళహస్తి పురాణ కథ ప్రాముఖ్యతను చాటి చెప్పే పాటలో కనిపించనున్నారు. 'పాట పాడినా, నృత్యం చేసినా, ఇది శివుని కోసం' అని ఈ పోస్టర్‌లో చూపించారు. ఈ మేరకు విష్ణు మంచు పోస్ట్ చేస్తూ.. 'పుట్టినరోజు సందర్భంగా నా కుమార్తెల ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేయడం ఆనందంగా ఉంది. ఈ క్షణంలో నా హృదయం గర్వంతో ఉప్పొంగుతోంది. నా చిన్ని తల్లులు తెరపై సృష్టించే మ్యాజిక్‌ను చూసేందుకు నేను ఎంతగానో ఎదురుచూస్తున్నాను''అని అన్నారు.



# మహేష్ డబ్బింగ్ ప్రధాన ఆకర్షణ

మోస్ట్ ఎవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ 'ముఫాసా: ది లయన్ కింగ్' ఈనెల 20న ఇండియాలో ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు భాషలలో విడుదల కానుంది. బారీ జెంకిన్స్ డైరెక్ట్ చేసిన ఈ చిత్రం 2019లో 'లైవ్-యాక్షన్ ది లయన్ కింగ్' బ్లాక్ బస్టర్ విజయాన్ని కొనసాగిస్తూ ప్రేక్షకులని అలరించ బోతోంది. 'ముఫాసా'కి హీరో మహేష్ బాబు వాయిస్ అందించారు. మహేష్ బాబు వాయిస్ ఓవర్‌లో రిలీజైన ట్రైలర్‌కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ నేపథ్యంలో అభిమానులకు స్పెషల్ ట్రీట్ ఇస్తూ మహేష్ బాబు అద్భుతమైన పోస్టర్‌ను నమ్రతా శిరోద్కర్ గ్రాండ్ మీడియా ఈవెంట్‌లో లాంచ్ చేశారు. టాకా పాత్రకు హీరో సత్యదేవ్, టిమోన్ పాత్రకు అలీ, పుంబా పాత్రకు బ్రహ్మానందం, కిరోస్ పాత్రకు అయ్యప్ప పి.శర్మ వాయిస్ అందించారు. నమ్రతా శిరోద్కర్ మాట్లాడుతూ, 'డిస్నీ టీమ్ థ్యాంక్స్. చాలా శ్రద్ధతో ఈ ప్రాజెక్ట్ చేశారు. ఇలాంటి ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌ని డబ్ చేయడం ఒక ఛాలెంజ్. ఇది పక్కా ఫ్యామిలీ ఫిల్మ్. ఎమోషనల్ రైడ్. మహేష్ బాబు చాలా ఎంజాయ్ చేస్తూ డబ్బింగ్ చెప్పారు. సినిమా అద్భుతంగా వచ్చింది. తప్పకుండా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. 'మన వాయిస్ డిస్నీ లైబ్రరీలో ఉండటం అనేది గ్రేట్ ఎచీవ్‌మెంట్. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, సరిలేరు నికెవ్వరు వంటి మహేష్‌బాబు చిత్రాల్లో నటించడం, ఇప్పుడు ఆయనతో కలిసి టాకా అనే క్యారెక్టర్‌కి వాయిస్ చెప్పడం చాలా ఆనందంగా ఉంది' అని హీరో సత్యదేవ్ చెప్పారు.

# నటనకు విరామం



12th ఫెయిల్' చిత్రంతో దేశంవ్యాప్తంగా గుర్తింపు పొందారు బాలీవుడ్ నటుడు విక్రాంత్ మాస్సే. తాజాగా ఆయన ఓ ప్రకటన చేశారు. తాను కొంత కాలం పాటు కొత్త సినిమాలు చేయలేనంటూ విరామం ప్రకటించారు. దీనిపై ఇన్‌స్టా వేదికగా ఓ నోట్ విడుదల చేశారు. 'కొన్ని సంవత్సరాలుగా అందరి నుంచి అసాధారణమైన ప్రేమను, అభిమానాన్ని పొందుతున్నాను. మీ అందరి మద్దతుకు ధన్యవాదాలు. కుటుంబ సభ్యులకు నా పూర్తి సమయాన్ని కేటాయించాల్సిన టైమ్ వచ్చింది. అందుకే సినిమాలను ఇక అంగీకరించడం లేదు. మళ్లీ సరైన సమయం వచ్చేంతవరకు.. 2025లో విడుదల కానున్న సినిమానే నా చివరి సినిమా. ఇటీవల నేను నటించిన చిత్రాలపై మీరు చూపిన ఆదరాభిమానాలు మర్చిపోలేను. అందరికీ కృతజ్ఞతలు' అని నోట్‌లో పేర్కొన్నారు. విక్రాంత్ మాస్సే సీరియల్స్‌తో కెరీర్ మొదలుపెట్టారు. 'బాలికా వధూ' (చిన్నారి పెళ్లికూతురు)తో అందరికీ అభిమాన నటుడిగా మారారు. 2017లో 'ఎ డెత్ ఇన్ ది గంజ్'తో వెండితెరపై హీరోగా కనిపించి అలరించారు. ఇటీవల జరిగిన 'ఇఫీ' వేడుకల్లోనూ అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకున్నారు.

Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad "office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332